







- నామినేషన్ పత్రాలను ఆర్వో శివ శంకర్ లోతేటికి అందజేస్తున్న నరసరావుపేట లోక్‌సభ టీడీపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు
- నరసరావుపేటలో భారీ ప్రదర్శన

నరసరావుపేట.. పసుపు మయం

- కోలాహలంగా టీడీపీ అభ్యర్థుల నామినేషన్ దాఖలు
- లావు శ్రీ కృష్ణదేవరాయలు, డాక్టర్ చదలవాడ అరవిందబాబు నామినేషన్లు
- పట్టణంలో భారీ ప్రదర్శన

ఆశ.. నిరాశ



తానొకటి తలిస్తే దైవం మరొకటి తలచింది అన్నట్లుగా ఆర్టీసీ ఉద్యోగుల పరిస్థితి తయారైంది. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలన్నది కార్మికుల కల. ప్రభుత్వంలో విలీనమైతే తమకున్న కష్టాలన్నీ తీరిపోతాయని, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతనాలు, ప్రయోజనాలు అందుతాయని ఆశ పడ్డారు. అందుకోసం విలీనం చేయాలని ఉద్యమాలు కూడా చేశారు. అధికారం చేపట్టిన కొద్దిరోజుల్లోనే ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తూ వైసీపీ పాలకుల నిర్ణయంతో ఉద్యోగులంతా సంబరాలు చేసుకున్నారు. ఆ సంబరాలు, వారి ఆనం దం ఎంతోకాలం నిలవలేదు. విలీనం కోరుకుని ఎంత పెద్ద తప్పు చేశారో తెలియడానికి వారికి అట్టే సమయం పట్టలేదు. విలీనం వల్ల తమకు వీసమెత్తు ప్రయోజనం కలగకపోగా, అప్పటికే ఉన్న అన్ని ప్రయోజనాలు కోల్పోయారు.

విలీనం.. వంచన

ఆర్టీసీ కార్మికులు.. విలీనంతో ఉద్యోగులయ్యారు. ప్రభుత్వంలో విలీనమైతే ఎంతో మేలు జరుగుతుంది.. తమ జీవితాలు బాగుపడతాయి.. ఆర్టీసీ కార్మికులుగా అనుభవించిన కష్టాలన్నీ దూరమవుతాయని భావించారు. అయితే మేలు కంటే కష్టాలు.. నష్టాలు ఎక్కువగా ఉండ టంతో విలీనం పేరుతో తమను ప్రభుత్వం వంచించిందని వాపోతున్నారు. విలీనంతో గతంలో ఆర్టీసీ కార్మికులుగా దక్కించుకున్న కార్మిక చట్టాలు, హక్కులు, సంక్షేమ పథకాలన్నింటినీ కోల్పోయారు. సరే జీతాలన్నా ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా ఉంటున్నాయా అంటే అదీ లేదు. దీంతో ఆర్టీసీ ఉద్యోగుల పరిస్థితి పెనంమీద నుంచి పొయ్యిలోకి పడి న చందంగా మారింది. కార్మికులు తల చింది ఒకటికాగా విలీనం పేరుతో వైసీపీ ప్రభుత్వం చేసింది మరొకటి. దీంతో ఉద్యోగులుగా మారిన కార్మికులు విలవిల లాడిపోతున్నారు. విలీనం పేరుతో ప్రభుత్వం ఆడిన నాటకంలో తాము బలిపశువులుగా మారిపోయామని ఆర్టీసీ ఉద్యోగులు వాపోతున్నారు.

మేలు కంటే కష్టాలే అధికం

- హక్కులు కోల్పోయిన ఆర్టీసీ కార్మికులు
- పెనం మీద నుంచి పొయ్యిలోకి ఉద్యోగులు
- గత ప్రయోజనాలతో పాటు ఓ పీఆర్సీ నష్టం
- కార్పొరేషన్లో ఉన్న హక్కులు, స్కీములన్నీ రద్దు
- హెల్త్ స్కీము రద్దుతో తీవ్ర ఇబ్బందుల్లో కార్మికులు
- పాత జీతాలతోనే పీఆర్సీ కలరింగ్.. నేటికీ వేతన వ్యత్యాసం

గుంటూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్మికులు కోరినట్లుగా ప్రభుత్వంలో విలీనం చేస్తున్నామని వైసీపీ అధినేత జగన్ ముఖ్యమంత్రి పదవి చేపట్టిన తర్వాత ప్రకటించారు. దీంతో ఆర్టీసీ కార్మికులు జగన్‌కు క్షీరాభిషేకాలు చేశారు. విలీనంతో తమ జీవితాలు బాగవుతాయని ఆర్టీసీ కార్మికులు భావించారు. అయితే విలీనం పేరుతో ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి తమ జీవితాలతో చెలగాటమాడుతున్నారని తొలుత వారు భావించలేదు. రోడ్డు రవాణా సంస్థను ప్రభుత్వం విలీనం చేయడం వెనుక కంటికి కనపడని వంచన ఉందని ఉద్యోగులు లేటుగా తెలుసుకున్నారు. విలీనమైన తర్వాత ఒక్కో ప్రయోజనం కోల్పోవాల్సి వచ్చింది. ఒక పీఆర్సీని కోల్పోవడమే కాకుండా, పాత జీతాలతోనే సరిపుచ్చుకోవాల్సి వచ్చింది. దానికి తోడు అప్పటి వరకూ వారికి వర్తించిన కార్మిక చట్టాలు, ట్రేడ్ యూనియన్ హక్కులు, సంక్షేమ పథకాలు అన్నీ రద్దయిపోయాయి. ఆర్టీసీ ఉద్యోగులకు ప్రతి నాలుగేళ్లకు ఒకసారి వేతన సవరణ (పీఆర్సీ) అమలు జరుగుతుంది. 2017లో వారికి వేతన సవరణ జరగ్గా 2020-21లో మరోమారు సవరణ జరగాలి. అయితే విలీనంతో ఆర్టీసీ ఉద్యోగులంతా ప్రభుత్వ ఉద్యోగులుగా మారారు కాబట్టి వారికి ప్రభుత్వ ఉద్యోగుల పీఆర్సీ అమలవుతుందని చెప్పి ఆర్టీసీలో జరగాల్సిన పీఆర్సీని ఎగవేశారు. ప్రభుత్వ ఉద్యోగుల పీఆర్సీ అనగానే 19 శాతం తక్కువగా ఉన్న తమ వేతనాలు ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పెరుగుతాయని ఆశపడ్డారు. కానీ ప్రభుత్వం వారికి టోకరా ఇచ్చింది. ఉద్యోగులకు ఆర్టీసీలోని ఉద్యోగ హోదాతో సమానంగా ప్రభుత్వ ఉద్యోగుల పే స్కేలు ఇవ్వకుండా, వారికన్నా తక్కువ హోదాలో ఉండి వారితో సమానంగా వేతనం పొందే ఉద్యోగుల పే స్కేలుతో సమానం చేసింది. దీంతో తక్కువ హోదా వున్న ఉద్యోగుల జీతాలతో వారు సరిపుచ్చుకోవాల్సి వచ్చింది. ఫలితంగా ఆర్టీసీ ఉద్యోగులకు 2019 నాటి వేతనాలతోనే సరిపుచ్చుకోవాల్సి వస్తోంది.

పేరుకే ఉద్యోగులు.. సెలవులు లేవు

ఆర్టీసీ ఉద్యోగులను పేరుకే ఉద్యోగులుగా చెబుతున్న ప్రభుత్వం వారిని విధుల్లో మాత్రం కార్మికులుగానే చూస్తోంది. వారికి ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా సెలవులు ఇవ్వకుండా కంపెనీల చట్టం కింద వారికి ఐదు సెలవులే వర్తిస్తాయని సెలవులు ఎగ్గొట్టారు. అయితే ప్రభుత్వ ఉద్యోగులు అయ్యారనే నెపంతో కార్మిక చట్టాలు, సమ్మె హక్కులు వర్తించవంటూ కార్మికుల హక్కులను కాజేశారు. దీంతో వారు తమ సమస్యలపై ఆందోళన చేసే హక్కును కూడా కోల్పోవాల్సి వచ్చింది.

పాత స్కీములన్నీ రద్దు..

ఆర్టీసీ కార్పొరేషన్‌గా ఉన్న సమయంలో ఉద్యోగులకు హెల్త్ స్కీము అమలు జరిగేది. ఈ స్కీము కింద ఎంత తీవ్రమైన అనారోగ్యం వచ్చినా ఉద్యోగులకు ఉచితంగా వైద్యం లభించేంది. దాదాపు 30 లక్షల రూపాయల వరకూ విలువైన వైద్యం కూడా ఉద్యోగులు పొందిన సందర్భాలు ఉన్నాయి. ఇప్పుడు ఉద్యోగులు ప్రతి నెలా రూ.225 చెల్లించి ఈహెచ్ఎస్ కార్డు తీసుకున్నా ఫలితం లేకుండా పోయింది. వైద్య పరీక్షలన్నీ సొంతంగానే చేయించుకోవాల్సి వస్తోందని ఉద్యోగులు చెబుతున్నారు. ఎస్సార్బీసీ కింద ప్రతి నెలా ఉద్యోగుల రూ.300 పొదుపు చేసుకుని దాని ద్వారా పిల్లల చదువులకు రుణాలు తీసుకునేవారు. విశ్రాంత ఉద్యోగులకు పెన్షన్ బెనిఫిట్స్ కల్పించేవారు. ఇప్పుడు ఈ పథకాన్ని కూడా ప్రభుత్వం రద్దు చేసింది. దీంతో విశ్రాంత ఉద్యోగులకు గతంలో వచ్చే పెన్షన్ కూడా దక్కకుండా పోయింది. విరమణ అనంతరం వారు ఒట్టి చేతులతోనే ఇళ్లకు పోవాల్సిన దుస్థితి నెలకొంది.



ఆర్థికంగా నష్టపోయాం

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం వల్ల తీవ్రంగా నష్టపోయాం. వేతనాలు ప్రభుత్వ ఉద్యోగులతో సమానం కాకపోగా, కార్పొరేషన్ ద్వారా వచ్చే అనేక ప్రయోజనాలు కోల్పోయాం. ఈహెచ్ఎస్ హెల్త్‌కార్డు ఎందుకూ పనికిరావడం లేదు. విలీనం వల్ల ఘోరంగా నష్టపోయాం.

- ఓ కార్మిక సంఘం నేత గుంటూరు

ఆందోళనలో ఉద్యోగులు

ఆర్టీసీ ఉద్యోగులకు ప్రతి నాలుగేళ్లకు ఒకసారి పీఆర్సీ ఉంటుంది. విలీనంతో ఈ పీఆర్సీ ఐదేళ్లకు పెరిగింది. పదేళ్లకు మారే అవకాశం ఉందని గతంలో ప్రభుత్వం ప్రకటించడంతో ఉద్యోగులు మరింత ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగుల కంటే డీఏ 8 శాతం వీరికి తక్కువగా ఉంది. ప్రభుత్వ వంచనతో ఉద్యోగులు అది కూడా కోల్పోయామని వాపోతున్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు 2018 జనవరి 1 నుంచి వేతన స్కేలు అమలు చేయగా, ఆర్టీసీ ఉద్యోగులకు 2022 జనవరి 1 నుంచి అమలు చేశారు. ఈ మధ్యకాలంలో కార్మికులకు రావాల్సిన డీఏలన్నీ ఇవ్వకుండా ఎగవేసిందని ఉద్యోగ సంఘాలు ఆరోపిస్తున్నాయి. ప్రభుత్వ ఉద్యోగులుగా మారిన కారణంగా గృహ అలవెన్స్(హెచ్ఆర్ఏ) 4 శాతం వరకూ తగ్గిందని ఉద్యోగులు వాపోతున్నారు. నగరాల్లో హెచ్ఆర్ఏ 16 నుంచి 12 శాతానికి, గ్రేడ్ 1 మున్సిపాలిటీల్లో 14.5 శాతం నుంచి 12 శాతానికి తగ్గిందని ఆవేదన చెందుతున్నారు. కార్పొరేషన్లో ఉండగా ప్రతి నెలా ఒకటో తేదీన వేతనాలు వచ్చేవని, పండుగ సమయాల్లో ఐదారు రోజులు ముందు గానే వేతనాలు పడేవని, ఇప్పుడవన్నీ కలగా మారిపోయాయని చెబుతున్నారు. ప్రభుత్వంలో విలీనం కాకుండా ఉంటే 2020-21 లో మరో పీఆర్సీ అమలు జరిగేదని, దానివల్ల ఇంతకంటే మెరుగైన వేతనాలు అమలు జరిగేవని చెబుతున్నారు.

దేవుళ్లకూ.. నైవేద్యం



- పెనుమాక చెన్నకేశవస్వామి ఆలయం

- ఆలయాలను కరుణించని సీఆర్‌డీఏ
- కౌలు జాప్యంతో నిర్వహణ అస్తవ్యస్తం
- పస్తులుంటున్న పూజారుల కుటుంబాలు
- కౌలుతోనే మనుగడ.. పట్టించుకోని ప్రభుత్వం
- వచ్చే జూన్‌కు ఆలయాలకు కౌలు రాక రెండేళ్లు

మంగళగిరి, ఏప్రిల్ 18: రాజధాని అమరావతికి భూములిచ్చిన రైతులే కాదు.. భూములిచ్చిన పాపానికి దేవుళ్లను కూడా వైసీపీ ప్రభుత్వం శిక్షిస్తుంది. రాజధానికి భూములిచ్చిన రైతులు సకాలంలో కౌలు అందక అల్లాడుతున్నారు. కౌలు అందక అమరావతి ప్రాంతంలోని చిన్నాచితకా దేవాలయాల తాలూకు దేవుళ్లు కూడా రోజువారీ నైవేద్యానికి నోచుకోలేకపోతున్నారు. ఇక ఆ దేవాయాలపైనే ఆధారపడి జీవిస్తున్న పూజారులు కూడా జీవనానికి అల్లాడిపోతున్నారు. రాజధాని భూముల కు ఇవ్వాల్సిన కౌలు సొమ్ములను ఏపీ సీఆర్‌డీఏ చెల్లించకుండా తాత్సారం చేస్తున్నది. కౌలు సొమ్ములపైనే ఆధారపడి కొనసాగుతున్న రాజధాని అమరావతిలోని ఆలయాల మనుగడ కష్టంగా మారింది. రేపు జూన్ నాటికి సీఆర్‌డీఏ చెల్లించాల్సిన కౌలు రెండేళ్లకు చేరుతుంది.

2019 నుంచి చెల్లింపులకు బ్రేకులు

టీడీపీ హయాంలో 2016 నుంచి వరుసగా మూడేళ్లపాటు ఈ కౌలు ఆదాయాలు నిర్ణీతకాలానికి సంబంధిత రైతులు లేదా ఆలయాల తాలూకు దేవదాయశాఖ ఖాతాలకు జమవుతూ వచ్చినప్పటికీ 2019లో వైసీపీ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి కౌలు చెల్లింపులకు బ్రేకులు పడుతూ వచ్చాయి. దీంతో రైతులు ప్రతి ఏటా ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించి కౌలు కోసం సీఆర్‌డీఏపై ఒత్తిడి తేవాల్సివస్తుంది. అయితే గత ఏడాది తాలూకు కౌలు ఆదాయాలు ఇంతవరకు ఆలయాల తాలూకు ఖాతాలకు జమ కాలేదు. దీంతో రాజధాని ప్రాంతంలోని ఆలయాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. మంగళగిరి శ్రీలక్ష్మీ నృసింహస్వామి దేవస్థానానికి పుష్కలంగా ఆదాయం ఉండడంతో కౌలు ఆలస్యమైనా ఎటువంటి ఇబ్బంది లేదు. కానీ చిన్నచిన్న ఆలయాలకు ఇతరాత్ర ఆస్తులు, ఆదాయ వనరులు లేని ఆలయాల పరిస్థితి, అక్కడ పని చేసే అర్చకుల పరిస్థితి దారుణంగా ఉంది. పండుగలు, ఉత్సవాల సంగతెలా ఉన్నా.. ఆయా దేవుళ్లకు రోజువారీ నైవేద్యానికి కూడా ఇబ్బందులు పడాల్సివస్తుందని పూజారులు వాపోతున్నారు. నైవేద్యంతో పాటుగా ఆలయాల పూజారుల జీతాలు ఆలయాల నిర్వహణ చూసే దేవదాయశాఖ సిబ్బంది జీతాలు సైతం నెలలతరబడినిలిచిపోయాయి. దీంతో పూజారులు, దేవదాయశాఖ సిబ్బందితోపాటు దేవుళ్ల సైతం సీఆర్‌డీఏ చెల్లించాల్సిన కౌలుకోసం ఎదురుచూస్తున్నారు. ఎన్నికల ముందైనా ప్రభుత్వం తమపై కరుణచూపి కౌలు విడుదల చేయకపోతుందా అంటూ రాజధాని ప్రాంత రైతులతో పాటు దేవుళ్ల కూడా ఆశిస్తున్నారు.

దేవుడి భూములు 1100 ఎకరాలు



జీతాలు అందక ఆస్పత్రిలో చేరిన పెనుమాక చెన్నకేశవ స్వామి ఆలయ అర్చకుడు ప్రసాదాచార్యులు

ప్రస్తుత రాజధాని అమరావతి పరిధిలోని 29 గ్రామాల్లో తొంభైతొమ్మిది శాతం ఆలయాలు దాతలు దానంగా రాసిచ్చిన మాన్యాలపైనే ఆధారపడి కొనసాగేవి. అయితే ఈ గ్రామాల్లోని రైతులతో పాటు ఆలయాల కింద ఉన్న సుమారు 1100 ఎకరాల దేవుడి మాన్యాలను కూడా దేవదాయశాఖ భూసమీకరణ కింద సీఆర్‌డీఏకు ఇచ్చేసింది. ఇందులో ఒక్క మంగళగిరి శ్రీపానకాల లక్ష్మీ నృసింహస్వామి దేవస్థానం తాలూకు భూములే 88 ఎకరాల వరకు ఉన్నాయి. మందడం గ్రూపులోని 30 ఆలయాల కింద ఉన్న 431.17 ఎకరాలను భూసమీకరణలో భాగంగా సీఆర్‌డీఏకి ఇచ్చారు. పెనుమాకలోని చెన్నకేశవస్వామి దేవస్థానం 12.41 ఎకరాలు సీఆర్‌డీఏకి ఇచ్చింది. మంగళగిరి దేవస్థానాల కింద 32 ఎకరాలు, కాజ గ్రూపు దేవస్థానాల కింద 47 ఎకరాలు ఇచ్చారు. మిగతా ఆలయాల విషయానికొస్తే నాలుగైదు ఎకరాల వంతున ఉంటాయి. ఈ భూములకు కౌలు కింద ఏటా సాధారణ భూములకు రూ.30 వేలు, జరీబు భూములైతే రూ.50 వేల వంతున చెల్లిస్తున్నారు. ఈ కౌలును ఏటా పదిశాతం వంతున హెచ్చించి చెల్లించేలా సీఆర్‌డీఏ ఒప్పందాలు చేసుకుంది.



ట్యాంకర్ల నీటితో మిరప మొక్కలు నీరు పోస్తున్న రైతులు

నెరవేరని.. నీటి కష్టాలు

- అమలుకాని జగన్ హామీలు
- ఐదేళ్లుగా ఒక్క సమస్య తీరితే ఒట్టు
- గురజాల నియోజకవర్గంలో తీవ్ర ఇబ్బందులు

పిడుగురాళ్ల, ఏప్రిల్ 18: వైసీపీ అధినేత జగన్ ప్రతిపక్ష హోదాలో 2019 ఎన్నికలకు ముందు పిడుగురాళ్ల ఎన్నికల ప్రచారంలో ఎన్నో హామీలు ఇచ్చారు. వీటిలో ప్రధానంగా సాగు, తాగునీటి హామీలున్నాయి. జగన్ అధికారం చేపట్టిన తర్వాత ఆయనిచ్చిన హామీల్లో ఒక్కటంటే ఒక్కటి కూడా హామీ అమలు కాలేదు. పిడుగురాళ్ల ఎన్నికల ప్రచారంలో జగన్ సాగర్ కాల్వల ద్వారా సాగునీరు అందిస్తామని, ప్రతి ఇంటికి కుళాయిల ద్వారా తాగునీరు అందించే ఏర్పాటు చేయడంతో పాటు అక్రమ మైనింగ్‌పై మాట్లాడారు. పిడుగురాళ్లలో సున్నం వ్యాపారులపై పెట్టిన కేసులను నెలరోజుల్లో రద్దు చేస్తామని నోటీసులకు భయపడొద్దన్న హామీకి దిక్కులేదు. గురజాల నియోజకవర్గంలో చివరి భూముల వరకు సాగునీరు అందిస్తామన్న హామీ నేటికి నెరవేరలేదు. తంగెడ, ఆకురాజుపల్లె మేజర్ కాల్వలకు కనీస మరమ్మతులు చేయక పోవడంతో మాచవరం, దాచేపల్లి, గురజాల మండలాలకు సంబంధించిన చివరి భూములకు నేటికి సాగునీరు అందడం లేదు. జగన్ అధికారంలోకి వచ్చాక ఆయన ఇచ్చిన హామీ నెరవేరకపోవడంతో సుమారు 25 వేల ఎకరాల భూమి ఖాళీగానే ఉంది. సాగర్ కాల్వల ఆధునికీకరణ పనులు ఐదేళ్లలో లేకపోవడం వల్ల చివరి భూముల రైతులు తాగునీటి కోసం నానా తంటాలు పడ్డారు. వారబందీ అమలుతో చివరి భూములకు సాగునీరు అందక పత్తి, మిరప రైతులు నష్టపోయారు.

ఇంటింటికి తాగునీరు ఎక్కడ


వైసీపీ అధికారంలోకి వచ్చాక నియోజకవర్గంలో ప్రతి ఇంటికి తాగునీరు అందిస్తామన్న జగన్ ఇచ్చిన హామీ నేటికి నెరవేరలేదు. టీడీపీ హయాంలో మంజూరైన నిధులనే మరలా జీవో మార్చి కొన్నాళ్ల క్రితం పిడుగురాళ్ల, దాచేపల్లి ప్రాంతాల్లో ఇంటింటికి కుళాయిలు వేసే పనులు ప్రారంభించారు. ఏడాదిలోపు పూర్తి చేస్తామన్న హామీ రెండేళ్లు అవుతున్నా పనులు నత్తనడకన జరుగుతున్నాయి. పిడుగురాళ్ల, దాచేపల్లి, గురజాల పట్టణాలలో తాగునీటి ఎద్దడిని గుర్తించి ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోకపోవడంతో మహిళలు ఇటీవల రోడ్డెక్కి ధర్నా చేశారు. గురజాల నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల్లో ఒక లక్షా 2 వేల 512 నివాస గృహాలు ఉండగా సగటున రోజుకు 5 లీటర్లు కూడా నీటి సరఫరా అందడం లేదు. ట్యాంకర్ల ద్వారా అందిస్తున్న అరకొర నీటికి సైతం అధికార పార్టీ నేతలు లక్షలాది రూపాయల బిల్లును సొంతం చేసుకుంటున్నారు.

భగ్గుమంటున్న సున్నం వ్యాపారులు

రాజకీయాలతో సంబంధం లేకుండా వ్యాపారం చేసుకుంటున్న తమపై అప్పటి వైసీపీ నేతలు కొందరు అక్రమ మైనింగ్, బిల్లులు లేవని కేసులు పెట్టించారని 2019 ఎన్నికల ప్రచారంలో పిడుగురాళ్ల సభలో జగన్ దృష్టికి సున్నం వ్యాపారులు తీసుకెళ్లారు. దీనిపై ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన నెలరోజుల్లోపే సున్నం వ్యాపారులపై పెట్టిన కేసులను రద్దు చేస్తామని ఇచ్చిన హామీ నేటికి నెరవేరలేదు. వైసీపీ అధికారంలోకి వచ్చాక సున్నం వ్యాపారులపై వేధింపుల పరంపర కొనసాగింది. జగన్ హామీ ఐదేళ్లు అయినా నెరవేరకపోవడంపై వ్యాపారులు భగ్గుమంటున్నారు.

విచ్చలవిడిగా అక్రమ మైనింగ్

టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు విచ్చలవిడిగా నేతలు అక్రమ మైనింగ్ కు పాల్పడుతున్నారని పిడుగురాళ్ల సభలో జగన్ ఆరోపించారు. వైసీపీ ఐదేళ్ల కాలంలో కొండమోడు, కోనంకి, నడికూడి, నారాయణపురం తదితర ప్రాంతాల్లోని ప్రభుత్వ భూముల్లోని సున్నపు ఖనిజాన్ని వైసీపీ నేతలు కొందరు ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అండదండలతో సగానికి పైగా ఖాళీ చేశారు. అనుమతి గోరంత, తొవ్వేది కొం డంత సామెతలా పిడుగురాళ్ల, గురజాల, దాచేపల్లి, మాచవరం మండలాల్లోని అధికార పార్టీ నేతల మైనింగ్‌తో 8లక్షలకు పైగా టన్నుల సున్నపురాయిని తరలించి కోట్లు గడించారు. అక్రమ మైనింగ్ వ్యవహారంలో వైసీపీ నేతల దురాఘాతానికి నీలకంఠ బాబు అనే వడ్డెర కార్మికుడు హత్య కు గురయ్యాడంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.



- కొండమోడు సమీపంలో మైనింగ్ ప్రాంతం

సాగునీటి హామీకి తూట్లు

కాల్వ చివరి భూములకు సాగునీరు అందిస్తామని జగన్ ఇచ్చిన హామీకి ఐదేళ్లు. కాల్వల ఆధునికీకరణ లేక రెండేళ్లుగా చివరి భూములు కొన్ని బీళ్లుగా ఉన్నాయి. కాల్వలను ఆధునీకరిస్తే చివరి భూములకు సాగునీరు అంది ఉండేది. రెండేళ్ల క్రితం ఆకురాజుపల్లి, తంగెడ మేజర్ల మరమ్మతులకు సుమారు కోటి రూపాయలు మంజూరైనా అధికార పార్టీ నేతలు సిండికేట్‌గా మారి 20 లక్షల పని చేసి నిధులు కాజేశారు. దీనిపై ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదు. టీడీపీ హయాంలో కాల్వల ఆధునికీకరణ తప్ప వైసీపీ హయాంలో చేసిందేమీ లేదు.



- గుదె శ్రీనివాసరావు, రైతు



టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడిగా మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ గురువారం నరసరావుపేటలోని జిల్లా కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన్ను మాజీ ఎమ్మెల్యేలు జీవీ ఆంజనేయులు, మక్కెన మల్లికార్జున రావు, పెదకూరపాడు టీడీపీ అభ్యర్థి భాష్యం ప్రవీణ్ తదితరులు సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు.



- తూటాకుతో నిండిన ఆకురాజుపల్లి మేజర్ కాలువ

కూటమితోనే అమరావతి కల సాకారం


కారుమంచిలో మాట్లాడుతున్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు

- కూటమితో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు స్వర్ణయుగం
- నరసరావుపేట ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు
- పేదలకు రెండు సెంట్ల స్థలం : జీవీ ఆంజనేయులు
- గ్రామాల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం

శావల్యాపురం, ఏప్రిల్ 18: ఆంధ్రుల ఏకైక రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్టులను టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి కూటమి అధికారంలోకి రాగానే పూర్తిచేసి ఐదేళ్లలో ప్రజల కలల్ని సాకారం చేస్తామని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. శావల్యాపురం మండలంలోని గుంటుపాలెం, వయ్యకల్లు, కారుమంచి గ్రామాల్లో బుధవారం రాత్రి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ప్రచారానికి వెళ్ళిన ఎంపీ లావు, మాజీ ఎమ్మెల్యేలు జీవీ, మక్కెనలకు మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు బ్రహ్మరథం పట్టారు. మహిళలు ఎదురెళ్ళి నేతలకు హారతులిచ్చి సాదరంగా గ్రామాల్లోకి ఆహ్వానించారు. కారుమంచి ఎన్టీఆర్ కూడలిలో టీడీపీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి మొత్తం రాజధానితో ముడిపడి ఉందని, అమరావతిని అభివృద్ధి చేసి పరిశ్రమలు తీసుకొచ్చి యువతకు ఉద్యోగావకాశాలు కల్పించగల సత్తా చంద్రబాబుకు మాత్రమే ఉందన్నారు. కూటమి అధికారంలోకి రాగానే గత ఐదేళ్ళుగా నిలిచిపోయిన ఎత్తిపోతల పథకం, పల్నాడు వాటర్‌గ్రిడ్‌లను పునఃప్రారంభించి గోదావరి జలాలతో రైతులకు రెండు పంటలకు సాగునీరు, ఇంటింటికీ కొళాయిలు వేసి ప్రజలందరికీ తాగునీరు అందిస్తామన్నారు. కూటమితో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు స్వర్ణయుగం రానుందని, 50 ఏళ్ళు నిండినవారికి రూ.4 వేలు ఫించన్‌లు అందించనున్నామని, అన్ని వర్గాలకు కార్పొరేషన్‌లు పెట్టి రాయితీలపై రుణాలిచ్చి వారిని ఆదుకొంటామన్నారు. కారుమంచి వద్ద ఏబీసీ కెనాల్‌పై శిథిలావస్థలోనున్న బ్రిడ్జిని పునర్ నిర్మాణం చేయిస్తామని హామీనిచ్చారు. మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ వినుకొండ నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసి ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని, వినుకొండ ఎస్ఎస్‌పీ కాలనీలో పార్కు, స్టేడియం నిర్మాణాలు, కొండపైకి వెళ్ళే ఘాట్‌రోడ్డుకు తారురోడ్డు నిర్మిస్తామని, భక్తుల సహకారంతో రామలింగేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ చేయిస్తానన్నారు. కూటమి అధికారంలోకి రాగానే ఎన్టీఆర్ కాలనీలు వేసి పేదలందరికీ రెండుసెంట్లు చొప్పున స్థలాలిచ్చి ఇళ్ళు కట్టిస్తామని, ఇంటి బిల్లులు రానివారందరికీ బిల్లులు ఇప్పిస్తామన్నారు. ఎమ్మెల్యేగా బొల్లా చేసిన అక్రమాలపై బట్టబయలు చేసి ఆయన్ని జైలుకు పంపడం ఖాయమన్నారు. మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లిఖార్జునరావు మాట్లాడుతూ వినుకొండకు పదిమంది ఎమ్మెల్యేలుగా చేసినా బొల్లా మాత్రమే అభివృద్ధి చేసినట్లుగా గొప్పలు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఎమ్మెల్యేగా ప్రజలకు ఆదర్శంగా ఉండాల్సిన బొల్లా ప్రెస్‌మీట్లలోనే వినలేనిబూతులు మాట్లాడి బూతుల ఎమ్మెల్యేగా మారాడని, రానున్న ఎన్నికల్లో ప్రజలంతా బొల్లాకు బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. అనంతరం కారుమంచిలో వైసీపీ నుంచి టీడీపీలో చేరిన 30కుటుంబాల వారికి నేతలు పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీ మండల అధ్యక్షులు గుంటూరు సాంబశివరావు, జనసేన మండల అధ్యక్షులు అడపాల అనిల్‌కుమార్, నాయకులు యరమాసు కోటేశ్వరరావు, గడిపూడి విశ్వనాథం, గోనుగుంట్ల వెంకట్రావు, కోట హరిబాబు పాల్గొన్నారు.


కూటమి అభ్యర్థులకు హారతులిస్తున్న మహిళలు


పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు జీవీ, మక్కెన

అరాచక పాలనకు చరమగీతం పాడాలి


రోడ్‌షోలో మాట్లాడుతున్న పెమ్మసాని చంద్రశేఖర్, పక్కన మనోహర్, ఆలపాటి

- గుంటూరు పార్లమెంట్ కూటమి అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని
- తెనాలి కూటమి అభ్యర్థి నాదెండ్ల మనోహర్, మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌లతో కలసి ఎన్నికల ప్రచారం
- రోడ్‌షోకు బ్రహ్మరథం పట్టిన ప్రజలు

కొల్లిపర, ఏప్రిల్ 18: రాష్ట్రంలో రాక్షస పాలనకు చరమగీతం పాడాలని గుంటూరు పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ధ్వజమెత్తారు. గురువారం మండల కేంద్రం కొల్లిపరలో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి పార్టీల అభ్యర్థి నాదెండ్ల మనోహర్, పెమ్మసాని చంద్రశేఖర్, మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. స్థానిక వీరభద్రస్వామి కాలనీ నుంచి బయలు దేరిన ర్యాలీ గ్రామ పురవీధుల్లో కొనసాగింది. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా రోడ్‌షోలో చంద్రశేఖర్ మాట్లాడుతూ రాష్ట్రంలో అవినీతి, దోపిడి పాలన కొనసాగుతోందన్నారు. కృష్ణానదిలో ఇసుక తవ్వకాలు జరిపి భారీ వాహనాల ద్వారా తరలిస్తున్నారని దీంతో రోడ్లుకూడా గుంతలమయింగా మారినట్లు తెలిపారు. నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ గతంలో తాను శాసనసభ్యునిగా పని చేసినప్పుడు తెనాలి నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో నడిపించానన్నారు. అరాచపాలన నుంచి రాష్ట్రం విముక్తి చెందాలంటే టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి పోటీ చేస్తున్న అభ్యర్థులను అత్యంత మెజార్టీతో గెలిపించాల్సిన అవసరం నేడు ఎంతైన ఉందని మనోహర్ స్పష్టం చేశారు.

మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ పెమ్మసాని చంద్రశేఖర్‌కు సైకిల్ గుర్తుపై ఓటు వేసి, తెనాలి అభ్యర్థిగా పోటీ చేస్తున్న నాదెండ్ల మనోహర్‌కు గ్లాసు గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాల్సిన బాధ్యత మీ అందరిపై ఉందన్నారు. అనంతరం కొద్ది మంది టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. రోడ్‌షోలో జడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టీనా, టీడీపీ మండల అధ్యక్షుడు భీమవరపు చినకోటిరెడ్డి, జనసేన మండల అధ్యక్షుడు యర్రు వెంకయ్యానాయుడు, టీడీపీ తెలుగురైతు కార్యనిర్వహక కార్యదర్శి వంగా సాంబిరెడ్డి, టీడీపీ జిల్లా కార్యదర్శి కంచర్ల అమృతరాజు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు గుదిబండి గోవర్ధనరెడ్డి, భీమవరపు లంకకోటిరెడ్డి, కట్టా శ్రీహరిరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


అభ్యర్థులకు ఘనస్వాగతం పలుకుతున్న గ్రామస్థులు

టీడీపీ ఉమ్మడి అభ్యర్థులను గెలిపించండి
- పెమ్మసాని సతీమణి డాక్టర్ శ్రీరత్న

మేడికొండూరు: రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే తెలుగుదేశం మిత్రపక్షాల అభ్యర్థులను గెలిపించాలని గుంటూరు పార్లమెంట్ నియోజక వర్గ టీడీపీ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ సతీమణి డాక్టర్ శ్రీరత్న విజ్ఞప్తి చేశారు. గుంటూరు రూరల్ మండలం, చల్లావారిపాలెంలోని అపార్ట్‌మెంట్‌లలో డాక్టర్ శ్రీరత్న గురువారం ఎన్నికల ప్రచారం చేశారు. గుంటూరు పార్లమెంట్ నియోజక వర్గంలో ఎంపీగా తన భర్త డాక్టర్ చంద్రశేఖర్‌ను, ప్రత్తిపాడు నియోజకవర్గ అభ్యర్థి రామాంజనేయులును గెలిపించాలని కోరారు. డాక్టర్ శ్రీరత్నకు మహిళలు హారతులిచ్చి ఆహ్వానించారు. కార్యక్రమంలో రావిపాటి మోహనరావు, చింతా అనూష, స్వర్ణ బాబు, జనసేన నేతలు సూరిశెట్టి హరీష్, నూదా పిచ్చయ్య, బీజేపీ నేతలు సురేష్ తదితరులు పాల్గొన్నారు.


డాక్టర్ శ్రీరత్నకు స్వాగతం పలుకుతున్న చల్లావారిపాలెం వాసులు

వ్యవసాయానికి విద్యుత్ మీటర్లు

- వైసీపీ స్టిక్కర్లు తొలగించి మీటర్లు బిగింపు

పిడుగురాళ్ల, ఏప్రిల్ 18: పల్నాడుజిల్లా పిడుగురాళ్ల మండలం వీరాపురంలో రెండు రోజులుగా వ్యవసాయ బోర్ల వద్ద ప్రభుత్వం విద్యుత్ మీటర్లను అమర్చుతుంది. మీటర్లు వద్దు బాబోయ్.. అంటూ రైతులు మొత్తుకుంటున్నా వినకుండా వ్యవసాయశాఖ ఆ పనిలో నిమగ్నమైంది. సాగుకి మీటరు వద్దన్న వారికి ఇంటి కనెక్షన్‌ను తొలగించి వేస్తామంటూ అధికారులు బెదిరింపులకు పాల్పడుతున్నట్లు పలువురు రైతులు ఆరోపిస్తున్నారు.


వీరాపురంలో రైతు పొలంలో అమర్చిన విద్యుత్ మీటర్

కౌలు రైతు ఆత్మహత్య


పులి వెంకటేశ్వర్లు (ఫైల్)

చుండూరు ఏప్రిల్ 18 : అప్పుల బాధ తట్టుకోలేక కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన బాపట్లజిల్లా చుండూరు మండలం మోదుకూరులో గురువారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన పులి వెంకటేశ్వర్లు (55) సొంత భూమి లేకపోవడంతో ఈ ఏడాది 10, అందకు ముందు 5 ఎకరాలు కౌలుకి సాగుచేశాడు. కొద్ది సంవత్సరాలుగా సరైన దిగుబడులు లేక, గిట్టుబాటు ధరలు లేక తుఫాన్ ప్రభావంతో వెంకటేశ్వర్లు రూ.10-15 లక్షల మేరా అప్పుల పాలయ్యాడు. కౌలు డబ్బుల కోసం ఒత్తిడి పెరిగిపోవడంతో తీర్చేమార్గం లేక అవమాన భారంతో బుధవారం పురుగు మందుతాగాడు. ఇది గుర్తించిన కుటుంబ సభ్యులు వెంటనే గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

ఆర్ఎంపీ, పీఎంపీల సమస్యలు పరిష్కరిస్తాం

- చిలకలూరిపేట కూటమి అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, ఏప్రిల్ 18: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆర్ఎంపీ, పీఎంపీల సమస్యలు పరిష్కరిస్తామని మాజీమంత్రి, టీడీపీ ఉమ్మడి అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు స్పష్టం చేశారు. పవిత్రమైన వృత్తిలో ఉంటూ గ్రామీణ ప్రాంత ప్రజల ఆరోగ్యమిత్రలుగా నిలుస్తున్న వారిని కాపాడుకొని ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గురువారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన ఆర్ఎంపీ, పీఎంపీల ఆత్మీయ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రత్తిపాటి మాట్లాడుతూ ఇప్పటికే పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ కూడా వారికి మెరుగైన శిక్షణ, గుర్తింపు కార్డులు అందిస్తామని చెప్పారని గుర్తు చేశారు. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తరువాత వంద రోజుల్లో ఆ హామీ అమలు చేస్తామని, కూటమి విజయంకోసం ఆర్ఎంపీలు, పీఎంపీలు కృషి చేయాలని ప్రత్తిపాటి పిలుపు నిచ్చారు. నియోజక వర్గాన్ని తాను అభివృద్ధి చేసినట్లుగా ఎవ్వరూ అభివృద్ధి చేయలేదని, ఒక్క ఛాన్స్ అన్న మాట విని విడదల రజినికి అవకాశం ఇస్తే ఐదు సంవత్సరాలు నియోజక వర్గాన్ని పట్టించు కోలేదని, దోచుకొని పారిపోయారని మండి పడ్డారు. నాసిరకం మద్యంతో ఏడాదికి రూ.30వేల కోట్ల చొప్పున ఐదు సంవత్సరాల్లో రూ.1.50 లక్షల కోట్లు దోచేశాడని, ఈ మద్యం వల్ల ప్రజల కాలేయం, కోమగ్రంధి దెబ్బతిని ఆస్పత్రుల పాలయ్యే వారి సంఖ్య పెరుగుతుందని, అందులో సమిధలుగా మారుతుంది బడుగు, బలహీన వర్గాల నిరు పేదలేనని ప్రత్తిపాటి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఏడాదిలో నాలుగైదు సార్లు బటన్‌లు నొక్కాడని, కాని ఎవ్వరికీ ఖాతాలో ఇప్పటి వరకు డబ్బు పడ లేదన్నారు. ఈ మోసగాడి ప్రభుత్వాన్ని ఇంటికి పంపించటానికి మీరంతా కంకణం కట్టుకోవాలని, సైకిల్ గుర్తుపై ఓట్లు వేయించి తెలుగుదేశం కూటమి అభ్యర్థులను శాసన సభకు నన్ను, పార్లమెంట్‌కు శ్రీ కృష్ణ దేవరాయలను అధిక మెజార్టీతో గెలిపించాలని ప్రత్తిపాటి కోరారు.


ఆర్ఎంపీ, పీఎంపీల సమావేశంలో మాట్లాడుతున్న పత్తిపాటి పుల్లారావు


ఏసీబీకి చిక్కిన సీఆర్డీఏ అధికారులు చంద్రశేఖర్‌రావు, రాజేంద్రసాయినాథ్

ఏసీబీ వలలో సీఆర్‌డీఏ అధికారులు

- బిల్డింగ్ అప్రూవల్ కోసం రూ.30వేల లంచం డిమాండ్
- పట్టుబడిన జూనియర్ ప్లానింగ్ ఆఫీసర్, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్

తెనాలి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): బిల్డింగ్ ప్లాన్ అప్రూవల్ కోసం లంచం డిమాండ్ చేసిన ఇద్దరు సీఆర్‌డీఏ అధికారులను గుంటూరు రేంజి ఏసీబీ అధికారులు వలపన్ని పట్టుకున్నారు. ఏసీబీ అదనపు ఎస్పీ మహేంద్ర మత్తే తెలిపిన వివరాల ప్రకారం... చేబ్రోలు మండలం వడ్లమూడికి చెందిన రత్నబాబు అనే వ్యక్తి తన బంధువు ఇంటి నిర్మాణానికి సంబంధించి బిల్డింగ్ ప్లాన్ అప్రూవల్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు. తెనాలి ఉడా కాలనీలో ఉన్న సీఆర్‌డీఏ జోనల్ కార్యాలయానికి ఎంత తిరిగినా పని కాకపోవటంతో అధికారులను వేడుకుంటే రూ.30వేలు లంచం డిమాండ్ చేశారని తెలిపారు. అన్ని అర్హతలున్నా లంచం డిమాండ్ చేయటం, రోజుల తరబడి తిప్పుతుండటంతో విసిగిపోయిన రత్నబాబు ఏసీబీని ఆశ్రయించారు. ఏసీబీ డీజీ రాజేంద్రనాద్‌రెడ్డి ఆదేశాల మేరకు గుంటూరు రేంజి ఏసీబీ అధికారుల బృందం గురువారం తెనాలిలోని సీఆర్‌డీఏ జోనల్ కార్యాలయంలో నిఘా వేశారు. రత్నబాబు తరపున వెళ్లిన ఒక ప్రైవేట్ ప్లానింగ్ చూసే వ్యక్తి నుంచి రూ.30వేలు లంచం తీసుకుంటుండగా ఇరువురు అధికారులను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్టు అదనపు ఎస్పీ తెలిపారు. కార్యాలయంలో జూనియర్ ప్లానింగ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న లేళ్ల చంద్రశేఖరరావు, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ ఘంటా రాజేంద్రసాయినాద్‌లను పట్టుకున్నట్టు చెప్పారు. దాడిలో ఏఎస్పీ మహేంద్ర మత్తేతో పాటు డీఎస్పీలు సత్యానంద్, ప్రతాప్‌కుమార్, మరో ఆరుగురు ఇన్‌స్పెక్టర్‌లు పాల్గొన్నారు.

పశ్చిమ డెల్టాకు 916 క్యూసెక్కులు

దుగ్గిరాల, ఏప్రిల్ 18: కృష్ణాపశ్చిమ డెల్టాకు 916 క్యూసెక్కుల నీటిని గురువారం విడుదల చేశారు. ప్రకాశం బ్యారేజివద్ద 6.4 అడుగులు నీటి మట్టం ఉంది. దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి రేపల్లెకాల్వ 394 క్యూసెక్కుల నీరు, నిజాంపట్నం కాల్వకు 265 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు.

ఉద్దండ్రాయునిపాలెం ఘటనపై ఫిర్యాదు

- విచారణకు నలుగురు అధికారులతో కమిటీ

తుళ్ళూరు, ఏప్రిల్ 18: ఉద్దండ్రాయుపాలెం రాజధాని శంకుస్థాపన ప్రదేశంలో ఏర్పాటు చేసిన మ్యూజియంలో గుర్తు తెలియని వ్యక్తులు నమూనాలు ధ్వంసం చేసిన ఘటనపై ఏపీ సీఆర్డీఏ కమీషనర్ వివేక్ యాదవ్ నలుగురు సభ్యులతో కూడిన అధికారుల కమిటీని నియమించారు. కమిటీ బృందం గురువారం ఘటనా స్థలాన్ని పరిశీలించింది గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసిన నమూనాలు పాక్షికంగా దెబ్బతిన్నట్టు గుర్తించారు. ఈ ఘటనపై కమిటీ బృందం తుళ్లూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇందుకు కారకులైన వ్యక్తులను వెంటనే గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులు పోలీసులను కోరారని సీఆర్డీఏ కార్యాలయం గురువారం జారీ చేసిన ఒక ప్రకటలో పేర్కొంది.

సెక్యూరిటీని తీసేసి..

గత టీడీపీ ప్రభుత్వం రాజధాని నమూనా ఆర్ట్ గ్యాలరీ సంరక్షణకు పోలీస్ సెక్యూరిటీని ఏర్పాటు చేసింది. అప్పట్లో సందర్శకులు ప్రధాని శంకుస్థాపన చేసిన ప్రదేశాన్ని చూడటానికి పోటెత్తారు. పవిత్రమైన మట్టి నీరు. ఆర్ట్ గ్యాలరీ, శంకుస్థాపన శిలాఫలకాన్ని రక్షించటానికి సెక్యూరిటీని పెట్టారు. వైసీపీ వచ్చిన ఒక సంవత్సరం కాపలా ఉంది. సందర్శకులు రావటానికి రోడ్లన్ని ఇసుక మాఫియా ధ్వంసం చేసింది. కాలక్రమంలో పోలీస్ సెక్యూరిటీని ఎత్తేశారు. భద్రత లేకపోవటంతో అసాంఘిక శక్తులు శంకుస్థాపన ప్రదేశంలో విచ్చలవిడిగా వ్యవహారాలు సాగిస్తున్నాయి. గత కొంత కాలం నుంచి అరాచక శక్తులు శంకుస్థాపన ప్రదేశాన్ని ధ్వంసం చేసున్నా సీఆర్డీఏ పట్టించుకోక పోవటం గమనార్హం. ఘటన వెలుగులోకి వచ్చాక చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేయటం విచిత్రంగా ఉందని భూములిచ్చిన రైతులు అంటున్నారు.

ఈ నెల 30, మే 6న పలు రైళ్ల రద్దు

గుంటూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ బ్లాక్ కారణంగా ఈ నెల 30, మే 6వ తేదీన పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు డీఆర్ఎంఎం రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 30న నెంబరు. 07779 గుంటూరు మాచర్ల, 07780 మాచర్ల - గుంటూరు, 07580 మాచర్ల - నడికుడి, 07579 నడికుడి - మాచర్ల, నెంబరు. 17646 రేపల్లె - సికింద్రాబాద్, 17645 సికింద్రాబాద్ - రేపల్లె రైళ్లను పూర్తిగా రద్దు చేస్తున్నామన్నారు.

మే 6వ తేదీన నెంబరు. 07791 కాచీగూడ - నడికుడి, 07792 నడికుడి - కాచీగూడ రైళ్లను రద్దు చేస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 30న నెంబరు. 12806 లింగంపల్లి - విశాఖపట్టణం జన్మభూమి ఎక్స్‌ప్రెస్ నడికుడి మార్గంలో కాకుండా వరంగల్, కాజీపేట మీదగా విజయవాడకు మళ్లించడం జరుగు తుందన్నారు. మే 6వ తేదీన నెంబరు. 17646 రేపల్లె - సికింద్రాబాద్ రైలు 60 నిమిషాల ఆలస్యంగా రీషెడ్యూల్ చేయడం జరుగుతుందన్నారు.

భానుడి భగభగ.. జనం విలవిల..

గుంటూరు(విద్య),ఏప్రిల్ 18: భానుడి భగభగలతో గురువారం గుంటూరు జిల్లా వ్యాప్తంగా ప్రజలు అల్లాడారు. వేసవి తీవ్రత ప్రారంభమైన మొదటి వారంలోనే ఎండ తీవ్ర పెరగడం ఇదే ప్రథమం. ఉదయం 11 గంటలకే నగరంలోని అనేక ప్రాంతాల్లో వీధులు ఖాళీ అయ్యాయి. వడగాల్పులు అధికంగా వీయడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. దీంతో చెట్ల నీడలను, శీతల పానీయాలను ఆశ్రయించారు. కొన్ని ప్రాంతాల్లో మరమ్మతుల పేరుతో విద్యుత్ సరఫరాను నిలిపివేయడంతో అక్కడి ప్రజలు ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు వేసవి తాపానికి ఇళ్లలోనే ఉడికి పోయారు.


పరదాలతో ప్రయాణం ..



ప్రజాస్వామ్య పరిరక్షణే ధ్యేయం

- టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్
- జిల్లా నేతల సమక్షంలో బాధ్యతలు స్వీకారం


బాధ్యతలు స్వీకరించిన అనంతరం కొమ్మాలపాటి శ్రీధర్‌ను అభినందిస్తున్న పెదకూరపాడు కూటమి అభ్యర్థి భాష్యం ప్రవీణ్ తదితరులు

నరసరావుపేటటౌన్, ఏప్రిల్ 18: రాష్ట్రంలో వైసీపీ రాక్షస పాలనను అంతం చేయడానికే కూటమి ఏర్పడిందని, ప్రజాస్వామ్యం పరిరక్షణే కూటమి ప్రధాన ధ్యేయం అని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. గురువారం నరసరావుపేటలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడిగా కొమ్మాలపాటి శ్రీధర్ బాధ్యతలు స్వీకరించారు. శ్రీధర్‌కు వేద పండితులు ఆశీర్వాదాలు అందజేశారు. అదేవిధంగా వినుకొండ మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయలు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, పెదకూరపాడు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి భాష్యం ప్రవీణ్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు వెన్నా సాంబశివారెడ్డి, నాదెండ్ల బ్రహ్మం చౌదరి, అబ్బూరి శివనాగ మల్లేశ్వరరావు, డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు, అట్లా చినవెంకటరెడ్డి.. కొమ్మాలపాటి శ్రీధర్‌ను ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కొమ్మాలపాటి మాట్లాడుతూ జిల్లా అధ్యక్షుడుగా చంద్రబాబు తనను నియమించడం తన అదృష్టం అన్నారు. పార్టీకి చేసిన సేవలకు తగిన గుర్తింపు రావడం సంతోషంగా ఉందన్నారు. అమరావతి పునఃనిర్మాణం జరగాలంటే కూటమి గెలవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్టా కిరణ్, గొట్టిపాటి జనార్ధన్‌బాబు, కరిముల్లా, సదాశివ రావు, రాపర్ల జగ్గారావు, వివిధ అనుబంధ సంఘాల అధ్యక్షులు కుమ్మెత కోటిరెడ్డి, కూరపాటి హనుమంతురావు, దాసరి ఉదయశ్రీ, కోసూరి రాధిక, గుర్రం నాగపూర్ణచంద్రరావు, నాగ సుధీర్, గంగిరెడ్డి శ్రీనివాసరెడ్డి, పాల్గొన్నారు.

అమరావతి శంకుస్థాపన ప్రదేశాన్ని అపవిత్రం చేశారు

- రాష్ట్ర ఏకైక రాజధాని అమరావతే
- 1584వ రోజుకు రైతుల ఆందోళనలు


వెంకటపాలెం శిబిరంలో మహిళలు, రైతుల ఆందోళన

తుళ్లూరు, ఏప్రిల్ 18: సాక్షాత్తు ప్రధాని మంత్రి మోదీ వేద మంత్రోచ్ఛరణల నడుమ రాజధాని అమరావతికి శంకుస్థాపన చేసిన ఉద్దండ్రాయునిపాలెం ప్రదేశాన్ని వైసీపీ ప్రభుత్వం అపవిత్రం చేసిందని రాజధాని ప్రాంత రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ ధర్నా శిబిరాలు, ఇళ్ల వద్ద నుంచి రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తున్న నిరసన దీక్షలు, ఆందోళనలు గురువారం నాటికి 1584వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ, ఏ రాష్ట్రానికి మూడు రాజధానులుండి అభివృద్ధి చెందిందో సీఎం జగన్‌రెడ్డి చెప్పాలని డిమాండ్ చేశారు. కేవలం అమరావతిని చంపేయటానికే మూడు ముక్కలాట పెట్టారన్నారు. రాష్ట్ర ఏకైక రాజధాని అమరావతేనని స్పష్టం చేశారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది.

83,908 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 88,176 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 83,908 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 68,946 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	8000	17500
నెంబరు. 5	9000	16200
273	11500	12200
341	8000	16500
4884	11000	15000
సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	19300
బ్యాడిగి	8500	16000
దేవనూరు డీలక్స్	9000	15500
తెల్లకాయలు	5000	11000

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.15
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	132, 141,152
చికెన్ విత్ స్కిన్	252.00
చికెన్ స్కిన్ లెస్	262.00

పల్నాడు వార్తలు



లావు శ్రీకృష్ణదేవరాయలుతో అభ్యర్థి యరపతినేని, ఎమ్మెల్సీ జంగా

లావు నామినేషన్‌కు తరలిన కూటమి శ్రేణులు

పిడుగురాళ్ల, ఏప్రిల్ 18: నరసరావుపేట పార్లమెంట్ కూటమి అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు గురువారం నామినేషన్ దాఖలు చేయనున్న నేపథ్యంలో పల్నాడు జిల్లాలోని టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు నరసరావుపేటకు భారీగా తరలివెళ్లారు. గురజాల నియోజకవర్గ కూటమి అభ్యర్థి యరపతినేని శ్రీనివాస రావు, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, కూటమి నేతలు ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలుతో కలసి నరసరావుపేటకు వెళ్లారు.

మాచవరం: శ్రీకృష్ణదేవరాయలు నామినేషన్ కార్యక్రమానికి మండలంలోని తురకపాలెం, వేమవరం, కొత్తపాలెం, మోర్జంపాడు, మల్లవోలు, తదితర గ్రామాల నుండి టీడీపీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. టీడీపీ మండల అధ్యక్షుడు బడిగుంచల వెంకటేశ్వర్లు, తెలుగు యువత మండల అధ్యక్షుడు షేక్ హసన్‌వలి, మాబువలి తరలివెళ్లిన వారిలో వున్నారు.

దుర్గి / నకరికల్లు / పెదకూరపాడు : నరసరావుపేట ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణ దేవరాయలు నామినేషన్‌కు మద్దతుగా దుర్గి, నకరికల్లు మండల పరిధిలోని పలు గ్రామాల నుంచి కూటమి శ్రేణులు భారీగా తరలివెళ్లారు. అలాగే పెదకూరపాడు నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి కూటమి నేతలు, కార్యకర్తలు అధిక సంఖ్యలో నరసరావుపేటకు తరలివెళ్లారు.



కేక్ కట్ చేస్తున్న మాచర్ల కూటమి అభ్యర్థి బ్రహ్మారెడ్డి

ఘనంగా బ్రహ్మారెడ్డి జన్మదిన వేడుకలు

మాచర్లటౌన్, ఏప్రిల్ 18: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి 62వ జన్మదిన వేడుకలను గురువారం మాచర్ల పట్టణం, మండల కేంద్రమైన వెల్దుర్తిలో ఘనంగా నిర్వహించారు. ముందుగా వెల్దుర్తిలోని తన నివాసంలో బ్రహ్మారెడ్డి కూటమి నేతలు, కార్యకర్తలు, అభిమానులు నడుమ భారీ కేక్‌ను కట్ చేసి పంచిపెట్టారు. అలాగే మాచర్ల పట్టణంలోని చిన కాన్వెంట్, రింగురోడ్డు తదితర ప్రాంతాల్లో కూడా బ్రహ్మారెడ్డి జనసేన వేడుకలను కోలాహలంగా జరిపారు. ఫోటోరైటప్ 18ఎంసిఎల్ 10ఎ

దుర్గి : మండలంలోని కోలగుట్లలో కూటమి అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. బాణాసంచా కాల్చి భారీ కేక్‌ను కట్ చేశారు. టీడీపీ నేత గర్నిడి రమేష్ మాట్లాడుతూ బ్రహ్మారెడ్డి గెలుపే ధ్యేయంగా నాయకులంతా పనిచేయాలని, ప్రతి ఒక్కరినీ కలుపుకొని పోయి భారీ మెజార్టీ వచ్చేందుకు శ్రమించాలన్నారు.

రెంటచింతల: స్థానిక టీడీపీ కార్యాలయంలో టీడీపీ నేతలు కేక్ కట్ చేసి పంచిపెట్టారు. బ్రహ్మారెడ్డి మరెన్నో జన్మదినోత్సవాలు జరుపుకోవాలని ఆకాంక్షించారు. అలాగే జంక్షన్‌లో అంజనేయస్వామి ఆలయంలో పూజలు చేశారు.

కారంపూడి : స్థానిక చెక్‌పోస్టు సెంటర్లో టీడీపీ పట్టణ అధ్యక్షుడు కటికల బాలకృష్ణ, మాజీ అధ్యక్షుడు తండా మస్తాన్‌జానిలు కేక్ కట్ చేసి పంచిపెట్టారు. రానున్న ఎన్నికల్లో బ్రహ్మారెడ్డి అఖండ మెజార్టీతో గెలిచి మాచర్లలో టీడీపీ జెండా ఎగురవేస్తారన్నారు. కార్యక్రమంలో ముస్లిం నేతలు మోదీన్‌సా, షేక్ నన్నేసా, ఆర్యవైశ్య సంఘ నేతలు పలువురు పాల్గొన్నారు.



పరమేశ్వరరావును పార్టీలోకి ఆహ్వానిస్తున్న బ్రహ్మారెడ్డి

టీడీపీలోకి వైసీపీ జిల్లా కార్యదర్శి ..

మాచర్లటౌన్, ఏప్రిల్ 18: వైసీపీ జిల్లా కార్యదర్శి తోటకూర పరమేశ్వరరావుతోపాటు మరో 50 మంది వైసీపీ కార్యకర్తలు కూటమి అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి సమక్షంలో గురువారం మాచర్ల మండలం విజయపురిసౌత్‌లో టీడీపీలో చేరారు. వీరికి బ్రహ్మారెడ్డి పార్టీ కండువాలను కప్పి సాదరంగా ఆహ్వానించారు. అలాగే మండలంలోని చింతలతండాకు చెందిన 20 వైసీపీ కుటుంబాలు, సాగర్ క్యాంపునకు చెందిన 11 వైసీపీ కుటుంబాలు బ్రహ్మారెడ్డి సమక్షంలో టీడపీ తీర్థం పుచ్చుకున్నాయి. పార్టీలో చేరిన వారిలో పాత్లావత్ దూప్‌సింగ్, మైలపల్లి నూకరాజు, బ్రహ్మయ్య, జూలకంటి నాగిరెడ్డి, రత్తయ్య, బాబు, వాడపల్లి రాంబాబు, చెల్లూరి అప్పలరాజు, అశోక్ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ధారునాయక్, మండల అధ్యక్షుడు నేరేటి వీరాస్వామి, జనసేన మండల అధ్యక్షుడు సాంబశివరావు, బొల్లా వెంకటేశ్వర్లు చౌదరి, గుండాల శ్రీను, మద్దిగపు వెంకట్రామిరెడ్డి, సైదారావు, మాజీ ఎంపీపీ గన్నెబోయిన వెంకటేశ్వర్లు, ఎం అప్పలరాజు, ఎరుపల్లి వెంకటేశ్వర్లు, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి నేతలు ప్రచారం

దుర్గి, ఏప్రిల్ 18: మండల పరిధిలోని ఓబులేశునిపల్లె గ్రామ శివారులో గల ఇటుకల బట్టి కాలనీలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నేతలు గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ సూపర్ 6 పథకాలను వివరించారు. రానున్న ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు లావు శ్రీకృష్ణదేవరాయలు, అసెంబ్లీ అభ్యర్థి బ్రహ్మారెడ్డిలను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు పాల్గొన్నారు.

బ్రహ్మారెడ్డి తనయుడు ఎన్నికల ప్రచారం

మాచర్ల రూరల్ : పట్టణంలోని 11వ వార్డులో గురువారం కూటమి అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి తనయుడు నాగార్జునరెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి సూపర్ 6 పథకాలను వివరించారు. సైకిల్ గుర్తుపై ఓటు వేసి తన తండ్రి బ్రహ్మారెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శాంతి, అనురాధ, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పూజా కార్యక్రమాలు ప్రారంభం

మాచవరం, ఏప్రిల్ 18: మండలంలోని వేమవరం గ్రామంలో అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమాన్ని పురస్కరించుకొని గురువారం పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. బస్టాండ్ సెంటర్‌లో సుమారు రూ.20 లక్షల వ్యయంతో 31 అడుగుల ఎత్తు విగ్రహాన్ని గ్రామస్థులు చందాలు వేసుకొని ఏర్పాటు చేశారు. ఈనెల 19న విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమం పురస్కరించుకొని పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ప్రతిష్ఠ అనంతరం మహా అన్నదాన కార్యక్రమం జరుగుతుందని కమిటీ సభ్యులు తెలిపారు.



యరపతినేని నిఖిల్ సమక్షంలో టీడీపీ కండువా కప్పుకున్న కొత్తూరు గ్రామస్థులు

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు

దాచేపల్లి,ఏప్రిల్ 18: మండలంలోని కొత్తూరు గ్రామ మాజీ సర్పంచ్‌తో పాటు మరో 20 కుటుంబాలు బుధవారం రాత్రి యరపతినేని శ్రీనివాసరావు తనయుడు నిఖిల్ సమక్షంలో టీడీపీ కండువా కప్పుకున్నారు. కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ బెల్లంకొండ భద్రి, గ్రామస్థులు బొమ్మనబోయిన వెంకటేశ్వర్లు, అంగోతు హనుమానాయక్, బాణావత్ కొండానాయక్, భూక్యా అంకయ్యనాయక్‌లు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలతో పేదలకు లబ్ధి

- పెదకూరపాడు నియోజకవర్గ అభ్యర్థి భాష్యం ప్రవీణ్
- అచ్చంపేటలో కూటమి ఎన్నికల కార్యాలయం ప్రారంభం
- టీడీపీలో చేరిన వివిధ గ్రామాల వైసీపీ శ్రేణులు



సమావేశంలో మాట్లాడుతున్న భాష్యం ప్రవీణ్

అచ్చంపేట, ఏప్రిల్ 18 : టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు పెట్టిన సూపర్ సిక్స్ పథకాల ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికి ఎంతో లబ్ధి చేకూరుతుందని పెదకూరపాడు నియోజక వర్గ అభ్యర్థి బాష్యం ప్రవీణ్ అన్నారు. గురువారం అచ్చంపేటలో నూతనంగా ఏర్పాటు చేసిన టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి పార్టీ కార్యాలయాన్ని మండల పార్టీ అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం ప్రారంభించారు. ఈ సందర్భంగా భాష్యం ప్రవీణ్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వంలో మహిళల సంక్షేమం, స్వయం ఆర్థికాభివృద్ధికి వివిధ పథకాలను అమలు చేయనున్నట్లు తెలిపారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పనే ధ్యేయంగా పరిశ్రమల స్థాపనతో ఐదు సంవత్సరాల్లో 20 లక్షల ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు వివరించారు. అలాగే ఉపాధి పొందలేని వారికి నిరుద్యోగ భృతిని అందజేస్తామన్నారు. ప్రతి రైతుకు ఏటా రూ.20 వేలు ఆర్థిక సాయం ద్వారా పెట్టుబడి ఖర్చులకు చేయూతనివ్వనున్నట్లు తెలిపారు. పాఠశాలకు వెళ్ళే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15 వేలు అందిమస్తాన్నారు. ప్రతి ఇంటికి సంవత్సరానికి మూడు గ్యాస్ సిలెండర్లు ఉచితంగా అందిస్తామని, అంతేకుండా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తామని తెలిపారు. ఉమ్మడి ప్రభుత్వం ద్వారానే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల అభివృద్ధే తన ధ్యేయమని అన్నారు. నియోజకవర్గంలో మంచి మెజార్టీతో గెలుస్తామని దీమా వ్యక్తం చేశారు. సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం, నల్లమేకల వెంకటేశ్వర్లు, వెనిగండ్ల కోటయ్య, ఎస్‌కే కాసుల, యడ్లపల్లి బుచ్చిబాబు, నూర్జహాన్ బేగం తదితర నాయకులు పాల్గొన్నారు.

మండల కేంద్రమైన అచ్చంపేటలో 51వ బూత్‌లో ఒంటిపులి వెంకటరావు ఆధ్వర్యంలో 20 మంది వైసీపీ కార్యకర్తలు భాష్యం ప్రవీణ్ సమక్షంలో టీడీపీలో చేరారు. ప్రవీణ్ వారికి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. టీడీపీలోకి చేరిన వారిలో బత్తుల చిన్న శ్రీను, చల్లా శివ, బత్తుల శ్రీరాములు, కొమెర కిషోర్, మల్లెల శ్రీను తదితరులు ఉన్నారు. అలాగే అచ్చంపేటకు చెందిన టీడీపీ నాయకులు కోటకొమ్ముల శివకృష్ణ, గూండా వెంకయ్య ఆధ్వర్యంలో 44 మంది ప్రవీణ్ సమక్షంలో టీడీపీ కండువా కప్పుకున్నారు. చేరిలో వారిలో సక్రియానాయక్, బుజ్జిబాయి, బాలాజీ నాయక్, పీ చిలకమ్మ బాయి, బీ శ్రీను నాయక్ తదితరులు ఉన్నారు.

ఎన్నికల ప్రచారంలో ప్రవీణ్ కుటుంబ సభ్యులు ..

క్రోసూరు: భాష్యం ప్రవీణ్ విజయాన్ని కాంక్షిస్తూ ఆయన కుటుంబ సభ్యులు గురువారం మండల కేంద్రం క్రోసూరులో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. క్రోసూరు ఎస్సీ కాలనీలో ప్రవీణ్ భార్య లావణ్య, కుమారుడు అఖిల్, మరదలు దీప్తి ఇంటింటికి తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాష్ట్రానికి భవిష్యత్ ఉండాలంటే నిరుద్యోగులకు జాబులు రావాలంటే చంద్రబాబు సీఎం కావాలన్నారు. కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రానికి భవిష్యత్తు ఉంటుందని అన్నారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా భాష్యం ప్రవీణ్‌ను, ఎంపీగా శ్రీకృష్ణదేవరాయలను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన వారితో భాష్యం ప్రవీణ్



క్రోసూరు ఎస్సీ కాలనీలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న భాష్యం లావణ్య

హింస, దౌర్జన్యాలను ఉపేక్షించం

- ఏఆర్ అడిషనల్ ఎస్పీ రాజు



తుమ్మకోటలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

రెంటచింతల,ఏప్రిల్ 18 : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లను భయభ్రాంతులకు గురిచేయడానికి ప్రయత్నించినా హింస దౌర్జన్యానికి పాల్పడినా ఉపేక్షించేంది లేదని, కఠిన చర్యలు తీసుకుంటామని ఏఆర్ అడిషనల్ ఎస్పీ రాజు హెచ్చరించారు. గురువారం మండలంలోని మంచికల్లు, తుమ్మకోట, పాలువాయి, రెంటాల, మిట్టగుడిపాడు తదితర గ్రామాల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించి ఓటర్లకు మనోధైర్యాన్ని కల్పించారు. ఈ సందర్భంగా ఏఆర్ అడిషనల్ ఎస్పీ రాజు ఆయా గ్రామస్థులతో మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో కీలకమైందని, ఎవరి ఓటును వారు వినియోగించుకోవడమనేది ప్రజాస్వామ్య పద్ధతని అన్నారు. అరాచకాలకు తావులేని ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి ప్రజలు, ఆయా పార్టీల నేతలు, కార్యకర్తలు సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ గాంధిరెడ్డి, గురజాల డీఎస్పీ పల్లపురాజు, సీఐ చిన మల్లయ్య, ఎస్ఐ కేవీ నారాయణరెడ్డి, సీఐఎస్ఎఫ్ (సెంట్రల్ ఇండిస్ట్రియల్ సెక్యూరిటి ఫోర్స్) సిబ్బంది, ఆర్మ్డ్ రిజర్వ్ పోలీసులు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

మాచవరం, ఏప్రిల్ 18: రానున్న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ప్రతిఒక్కరు సహకరించాలని ఎస్ఐ అమీనుద్దీన్ ప్రజలను కోరారు. గురువారం మండలంలోని గంగిరెడ్డిపాలెం, మల్లవోలు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి ఓటు హక్కు వినియోగంపై సూచనలు, సలహాలు అందజేశారు. ఓటు వున్న ప్రతిఒక్కరు వినియోగించుకోవాలని, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేవిధంగా సహకరించాలని కోరారు. తమ ఓటు నిర్భయంగా వినియోగించుకోవాలని,ఒత్తిళ్లకు, ప్రలోభాలకు గురికావాల్సిన అవసరం లేదని తెలియజేశారు. ఎవరైనా ఎక్కడైనా ఒత్తిడి తీసుకొస్తే పోలీసు వారి దృష్టికి తీసుకురావాలని సూచించారు.

రేపు మాదిగల ఆత్మీయ సదస్సు

రాజుపాలెం,ఏప్రిల్18: సత్తెనపల్లి పట్టణంలోని నియోజకవర్గ కన్నా లక్ష్మీనారాయణ కార్యాలయంలో ఈనెల 20న మాదిగల ఆత్మీయ సదస్సు నిర్వహించనున్నట్లు టీడీపీ మండల అధ్యక్షులు పల్లపాటి పెద్దిరాజు, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు శనగపూల వెంకయ్యలు తెలిపారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని మాదిగ సామాజికవర్గం వారు ఈ సదస్సుకు హాజరై విజయవంతం చేయాలనికోరారు. సదస్సుకు రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఎమ్మెస్ రాజు, ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రుద్రపాటి సురేష్ మాదిగ హజరుకానున్నట్లు వారు తెలిపారు.

నామినేషన్ల దాఖలు

సత్తెనపల్లి, ఏప్రిల్ 18 : నియోజ వర్గంలో పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థిగా రంగిశెట్టి నాగేశ్వరరావు గురువారం నామినేషన్ దాఖలు చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలోని నియోజకవర్గ ఎన్నికల అధికారి మురళీ కృష్ణకు నామినేషన్ పత్రాన్ని అందించారు.

పిడుగురాళ్ల : గురజాల నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థులుగా గురువారం పిరమిడ్ పార్టీ అభ్యర్థి యరమోతు ప్రసాదరావు, నేషనల్ నవక్రాంతిపార్టీ అభ్యర్థి కనకం శ్రీనివాసరావులు తమ నామినేషన్ పత్రాలను ఆర్వో రమణాకాంత్‌రెడ్డికి అందజేశారు.

పెదకూరపాడు: పిరమిడ్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా జింకా మల్లికార్జునరావు, స్వతంత్ర్య అభ్యర్థి జీ.అంకమరావులు నామినేషన్లను దాఖలు చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి కందుల శ్రీరాములు తెలిపారు. కాంగ్రెస్‌పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పమిడి నాగేశ్వరరావు నామినేషన్ వేసేందుకు వచ్చారు. అయితే ఆయన సరైన పత్రాలు చూపకపోవడంతో నామినేషన్ వేయకుండానే వెనుదిరాగారు.

వలంటీర్ల రాజీనామాలు ఆమోదం

రెంటచింతల,ఏప్రిల్ 18: మండంలోని వివిధ గ్రామాలకు చెందిన వలంటీర్లు 34 మంది చేసిన రాజీనామాలను గురువారం ఆమోదించినట్లు ఎంపీడీఓ అధికారి పెదప్రోలు శంకరరావు పేర్కొన్నారు. ఇప్పటి వరకు 49 మంది రాజీనామాలను అంగీకరించామన్నారు.

అచ్చంపేట: అచ్చంపేటలోని 1,2 సచివాలయపరిధిలో 61 మంది వలంటీర్లు ఉండగా వీరిలో 41 మంది రాజీనామా చేసి, ఆయా లేఖలను కార్యదర్శి సుబ్బారావుకు అందజేశారు.

జనసేన పదవికి బొర్రా రాజీనామా

సత్తెనపల్లి, ఏప్రిల్ 18 : జనసేన నియోజక వర్గ సమన్వయ కర్త బొర్రా వెంకట అప్పారావు తన పదవికి రాజీనామా చేస్తున్నట్టు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక నాయకత్వం కావాలని నియోజక వర్గ ప్రజలు కోరుకుంటున్న నేపథ్యంలో పదవికి రాజీనామా చేసినట్టు ఆయన తెలిపారు. నియోజక వర్గ ప్రజల ఆశయ సాధనకోసం పోరాటం చేస్తామని ఆయన తెలిపారు. భవిష్యత్తు కార్యాచరణను తెలియజేస్తానని అన్నారు.

21న ఆరవ తరగతి ప్రవేశ పరీక్ష

క్రోసూరు, ఏప్రిల్ 18 : క్రోసూరు మోడల్ స్కూల్‌లో 6వ తరగతి ప్రవేశానికి గాను ప్రవేశ పరీక్ష ఈనెల 21న ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు జరుగుతుందని ప్రిన్సిపల్ మేరీ సూజన్ గురువారం తెలియ జేశారు. హాల్ టిక్కెట్లను ఇంటర్నెట్ సెంటర్ నుంచి డౌన్‌లోడు చేసుకోవచ్చన్నారు. ఉదయం 9:30 గంటల కల్లా పరీక్షా హాల్ వద్దకు రావాలన్నారు. మోడల్ స్కూల్‌లో ప్రవేశం లభించిన వారికి ఏడు సంవత్సరాల పాటు ఉచితంగా ఇంగ్లీషు మీడియంలో విద్యా బోధన ఉంటుందని ఆమె తెలిపారు.

మద్యం స్వాధీనం

దాచేపల్లి, ఏప్రిల్ 18: దాచేపల్లి మండలంలోని ముత్యాలంపాడు గ్రామంలో అక్రమంగా నిల్వచేసిన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు గురజాల ఎక్సైజ్‌శాఖ అధికారులు గురువారం తెలిపారు. ముత్యాలంపాడు గ్రామంలో షేక్ సైదా అనే వ్యక్తి వద్ద నుండి 180 ఎంఎల్ 90 చీప్ లిక్కర్స్ బాటిల్స్, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. అధికారులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మాటతప్పిన మహేష్‌రెడ్డి

- జంట గ్రామాల అభివృద్ధిపై ఎమ్మెల్యే హామీకి ఐదేళ్లు
- నేటికీ ఏ ఒక్క సమస్యను పట్టించుకోని వైనం
- 200 ఎకరాల్లో అక్రమంగా మట్టి తవ్వకాలు



జంట గ్రామాల మధ్య అధ్వానంగా రహదారి

గురజాలటౌన్, ఏప్రిల్ 18: మండలంలోని దైద, తేలుకుట్ల జంట గ్రామాలను అభివృద్ధి బాటలో నడిపిస్తామని గత ఎన్నికల్లో ఇచ్చిన మాటను ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి తప్పారు. జంట గ్రామాలను అభివృద్ధి చేస్తామని చెప్పి ఐదేళ్లు గడిచినా హామీని నిలబెట్టుకోలేదు. జంట గ్రామాలకు బస్టాండ్, ప్రతి వీధిలో సిమెంట్ రోడ్లు, కృష్ణానది నుంచి ప్రతి ఇంటికి మంచినీటి సదుపాయం కల్పిస్తామని మహేష్‌రెడ్డి హామీనిచ్చారు. ప్రస్తుతం జంట గ్రామాల ప్రజలు తాగునీటికి తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. కృష్ణానది నుంచి తాగునీరు అందించలేకపోయారు. కనీసంగా ట్యాంకర్ల ద్వారా కూడా గ్రామాలకు తాగునీరు అందించడం లేదు. వైసీపీ అధికారంలోకి వచ్చాక అభివృద్ధి చేయకపోగా దైద గ్రామంలో గోరంత అనుమతులు తీసుకొని 200 ఎకరాల్లో అక్రమ తవ్వకాలు జరిపారు. తవ్వకాలు జరిపిన ప్రదేశంలో భారీగా గోతులు ఏర్పడ్డాయి, వర్షాలు పడితే ప్రమాదభరితంగా మారే అవకాశం ఉంది.

అభివృద్ధి చేస్తామని అరాచకం చేశారు



జంట గ్రామాల్లో అభివృద్ధి చేస్తామని చెప్పి అరాచకం చేశారు. గత ఎన్నికల ప్రచారానికి వచ్చినప్పుడు ఇచ్చిన హామీలు తుంగలో తొక్కారు. ప్రధాన రహదారులు అస్తవ్యస్తంగా మారాయి.

- పోట్ల నరేష్, దైద గ్రామం

మట్టిని దోచుకున్నారు



వైసీపీ అధికారంలోకి వచ్చాక గ్రామంలో వందల ఎకరాల్లో అక్రమంగా మట్టిని దోచుకొని అమ్ముకున్నారు. గ్రామాల్లో ఎటువంటి జరగలేదు. ఐదేళ్లు ఎదురుచూసినప్పటికీ ఫలితం లేదు.

- గంగినేని బుజ్జి, దైద గ్రామం



కొమ్మాలపాటిని ఆలింగనం చేసుకుంటున్న జీడీసీసీ బ్యాంక్ మాజీ డైరెక్టర్ వర ప్రసాదు

కొమ్మాలపాటికి అభినందనలు ..

పెదకూరపాడు, ఏప్రిల్ 18 : పెదకూరపాడు మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ పల్నాడుజిల్లా టీడీపీ అధ్యక్షుడిగా నరసరావుపేటలోని పార్టీ కార్యాలయంలో గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీధర్‌ను పెదకూరపాడు నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి భాష్యం ప్రవీణ్ కలసి స్వీటు తినిపించి అభినందనలు తెలిపారు. జీడీసీసీ బ్యాంక్ మాజీ డైరెక్టర్ ఎన్‌వీవీఎస్ వరప్రసాదు కొమ్మాలపాటి శ్రీధర్‌ను కలసి అభినందనలు తెలిపారు. నియోజకవర్గంలోని పలు మండల, గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలి వెళ్ళి కొమ్మాలపాటి శ్రీధర్‌ను బొకేలు అందించి శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు.

క్రోసూరు/ అమరావతి : క్రోసూరు మండలానికి చెందిన పలువురు టీడీపీ నేతలు నరసరావుపేటలోని జిల్లా టీడీపీ కార్యాలయానికి వెళ్ళి కొమ్మాలపాటికి పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలియ జేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు గుడిపాడుబాషా, టీడీపీ కార్యదర్శి నలజాల కోటేశ్వరరావు, టీడీపీ సీనియర్ నేత మన్నెం శ్రీనివాసరావు, షేక్ సలాం, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ ఏపూరి నాగేశ్వరరావు, తోకా వెంకటరావు, పిల్లకతుపుల రామయ్య, దుద్దుల యోహాన్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ పల్నాడుజిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన కొమ్మాలపాటి శ్రీధర్‌కు మండల పరిధిలోని పలువురు నాయకులు నరసరావుపేటలోని జిల్లా పార్టీ కార్యాలయానికి అభినందనలు తెలియజేశారు. సాయంత్రం కొమ్మాలపాటి అమరావతికి చేరుకున్నారు. అక్కడ ఆయనను మాజీ సర్పంచ్ సుభానీ యూత్, గోపాల్‌నగర్‌కు చెందిన టీడీపీ నాయకులు సన్మానించారు. శ్రీధర్ వెంట స్థానిక టీడీపీ నేతలు పాల్గొన్నారు. అనంతరం కొమ్మాలపాటి ఇటీవల మృతిచెందిన టీడీపీ మండల కార్యదర్శి షేక్ అమానుల్లా కుటుంబాన్ని కలిసి పరామర్శించారు.



ప్రచారంలో మాట్లాడుతున్న కన్నా, లావు శ్రీ కృష్ణ దేవరాయలు

సైకో పాలనకు చరమగీతం పాడండి

- ఎన్నికల ప్రచారంలో శ్రీ కృష్ణ దేవరాయలు, కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, ఏప్రిల్ 18 : రాష్ట్రంలో సైకో పాలనకు ప్రజలు చరమగీతం పాడాలని ఉమ్మడి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం మండలంలోని ధూళ్ళిపాళ్ళలో నరసరావుపేట ఎంపీ అభ్యర్థి లావు శ్రీ కృష్ణ దేవరాయలు, కన్నా లక్ష్మీనారాయణ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. కన్నా మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ప్రజలపై పెను ఆర్థిక భారాలను మోపిందన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలోనే అన్ని వర్గాలకు మేలు జరిగిందన్నారు. సైకిల్ గుర్తు పై ఓటు వేసి తనను, కృష్ణ దేవరాయలను గెలిపించాలన్నారు. నరసరావుపేట ఎంపీ అభ్యర్థి లావు శ్రీ కృష్ణ దేవరాయలు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలోని వ్యవస్థలను నాశనం చేసిందన్నారు. ప్రతి ఎన్నికలకు ఒక జగన్నాటకం జరుగుతుందన్నారు. జగన్ డ్రామాలు నమ్మే పరిస్థితుల్లో జనం లేరన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా, యువతకు ఉద్యోగాలు రావాలన్నా తెలుగుదేశం, జనసేన, బీజేపీ ప్రభుత్వంనే సాధ్యమన్నారు. రాష్ట్రానికి పూర్వ వైభవం తీసుకు రావాలన్నదే కూటమి లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఆళ్ళ అమరేశ్వ రరావు, బైరపునేని తిరుపతిరావు,సాంబశివరావు, హనుమంతరావు, చంటి, ప్రభుదాపు, వెంకటరావు, సంధ్య పాల్గొన్నారు.

టీడీపీలోకి చేరికలు..

పట్టణ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు పసుపులేటి ఓంకార్ గురువారం కాంగ్రెస్‌ను వీడి టీడీపీలో చేరారు. ఓంకార్‌కు కన్నా లక్ష్మీనారాయణ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఓంకార్‌తో పాటు మరో 20 కుటుంబాలు కాంగ్రెస్‌ను వీడి టీడీపీలో చేరారు. వీరంతా కన్నా సమక్షంలో టీడీపీలో చేరారు.

బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం తెస్తామని కన్నా అన్నారు. పట్టణంలోని పణిదం సొసైటీ ప్రాంతంలో పద్మశాలి ఆత్మీయ సమావేశం జరిగింది. కన్నా మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలోనే బీసీలకు మేలు జరిగిందన్నారు. రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తు పై ఓట్లు వేసి తనను గెలిపించాలనికోరారు. సమావేశంలో నూర్‌బాషా జానీబాబు, మేరీగ్రేస్, నాగార్జున, శ్రీనివాసరావు, నాగభూషణం, మల్లేశ్వరి, దుర్గ, శ్యాంసుందర్, కుమార్, మునిని బాబు, స్వామి, శ్రీను, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



నరసరావుపేటలో లావు నామినేషన్ సందర్భంగా భారీ ర్యాలీ

సీన్ రిపీట్..


- పొన్నూరులో నరేంద్రపై ఎప్పుడూ కొత్త ప్రత్యర్థులే...
- ఆరు ఎన్నికల్లో ఐదుగురిపై గెలుపు
- ఏడోసారి తెరపైకి మరో అభ్యర్థి



గుంటూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు అసెంబ్లీ నియోజక వర్గంలో తెలుగు దేశం పార్టీ అభ్యర్థి ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ప్రతీ ఎన్నికలోనూ కొత్త అభ్యర్థితో తలపడుతూ వస్తున్నారు. ఆయనపై ప్రత్యర్థులను బరిలోకి దింపిన కాంగ్రెస్, వైసీపీలు అదే ఆనవాయితీని కొనసాగిస్తున్నాయి. ఈ దఫా కూడా సీన్ రిపీట్ అవుతోంది. తండ్రి మరణంతో వారసత్వంగా ధూళిపాళ్ల నరేంద్రకుమార్ 1994లో పొన్నూరు నుంచి రాజకీయాల్లోకి ప్రవేశించారు. 1983 నుంచి ఇప్పటివరకు టీడీపీ ఆవిర్భవించిన తరువాత జరిగిన 9 ఎన్నికల్లోనూ పొన్నూరులో ధూళిపాళ్ల కుటుంబమే పోటీ చేస్తూ వచ్చింది. నరేంద్రకుమార్ తండ్రి వీరయ్య చౌదరి 1983, 1985, 1989లో ఇక్కడి నుంచి పోటీ చేశారు. 1989లో ఓడిపోగా 1983, 1985లో గెలుపొందారు. 1988-89లో ఏడాది పాటు రాష్ట్ర రెవెన్యూ మంత్రిగా పని చేశారు. 1989 ఎన్నికల్లో రెవెన్యూ మంత్రిగానే ఉంటూ కాంగ్రెస్ అభ్యర్థి చిట్టినేని వెంకటరావుపై ఓడిపోయారు.

ఆరుసార్లు మారిన నరేంద్ర ప్రత్యర్థులు..

ధూళిపాళ్ల నరేంద్రకుమార్ 1994 నుంచి 2019వరకు జరిగిన ఎన్నికల్లో ఆయన ఐదుసార్లు గెలుపొందగా ఒకసారి ఓటమి పాలయ్యారు. నరేంద్రపై ఆరుసార్లు ప్రత్యర్థులు మారారు. త్వరలో జరగబోయే ఎన్నికల్లో అంబటి మురళీకృష్ణకు వైసీపీ టిక్కెట్ ఖరారు చేసింది. దీంతో నరేంద్రపై ఏడోసారి కొత్త అభ్యర్థి పోటీ పడబోతున్నారు. ఈ నేపథ్యంలో ఆయనపై పోటీ ఎప్పుడూ కొత్త అభ్యర్థే అనే ఆనవాయితీ కొనసాగుతోంది.



నరేంద్రకుమార్ తండ్రి వీరయ్య చౌదరి మరణంతో 1994 అసెంబ్లీ ఎన్నికల ముందు రాజకీయాల్లో చేరారు. తండ్రి నిర్వహించిన సంగం డెయిరీ ఛైర్మన్, పొన్నూరు ఎమ్మెల్యే పదవులను తనయుడు నరేంద్రకుమార్ కైవసం చేసుకున్నారు. 2009లో పొన్నూరు నియోజకవర్గం పునర్విభజనతో రూపురేఖలు మారాయి. ప్రస్తుతం పెదకాకాని, పొన్నూరు, చేబ్రోలు మండలాలు, పొన్నూరు పురపాలక సంఘం ఈ నియోజకవర్గ పరిధిలో ఉంది.

ఆనవాయితీ ప్రకారం మారిన అభ్యర్థి...

పొన్నూరులో నరేంద్రపై ప్రత్యర్థి మారడం ఆనవాయితీగా వస్తుంది. దానిలో భాగంగా ప్రత్యర్థి కిలారి రోశయ్య తిరిగి పోటీ చేయాలని భావించారు. అయితే ఆయన్ని వైసీపీ అధిష్టానం గుంటూరు ఎంపీ అభ్యర్థిగా ఖరారు చేసింది. దీంతో అంబటి రాంబాబు సోదరుడు మురళీకృష్ణని ఈ సారి కొత్త అభ్యర్థిగా వైసీపీ ఎంపిక చేసింది.

నరేంద్రపై పోటీ చేసిన వారి వివరాలు..

1994 - తలశిల వెంకటరామయ్య చౌదరి
1999 - చిట్టినేని ప్రతాప్
2004 - మన్నవ రాజకిషోర్
2009 - మారుపూడి లీలాధరరావు
2014 - రావి వెంకట రమణ
2019 - కిలారి రోశయ్య

నరసరావుపేట.. పసుపు మయం

- కోలాహలంగా టీడీపీ అభ్యర్థుల నామినేషన్ దాఖలు
- లావు శ్రీ కృష్ణదేవరాయలు, డాక్టర్ చదలవాడ అరవిందబాబు నామినేషన్లు
- నరసరావుపేటలో భారీ ప్రదర్శన

నరసరావుపేట, ఏప్రిల్ 18: నరసరావుపేట పట్టణం గురువారం పసుపుమయమైంది. తెలుగుదేశం-జనసేన-బీజేపీ కూటమి అభ్యర్థులు లావు శ్రీకృష్ణదేవరాయలు, డాక్టర్ చదలవాడ అరవిందబాబు నామినేషన్ కార్యక్రమం కోలాహలంగా జరిగింది. ప్రధాన రహదారులు కూటమి నేతలు, కార్యకర్తలు, అభిమానులతో కిక్కిరిసిపోయాయి. యువకుల నృత్యాలు, బాణసంచా, తీన్‌మార్‌లతో అట్టహాసంగా ప్రదర్శన సాగింది. తెలుగుదేశం జిందాబాద్ నినాదాలు మార్మోగాయి. నరసరావుపేట పార్లమెంట్‌కు కూటమి అభ్యర్థిగా లావు శ్రీకృష్ణదేవరాయలు, నరసరావుపేట అసెంబ్లీ అభ్యర్థిగా డాక్టర్ చదలవాడ అరవిందబాబు నామినేషన్‌లను దాఖలు చేశారు. శ్రీకృష్ణదేవరాయలు కలెక్టరేట్‌లోని ఆర్వో కార్యాలయంలో ఆర్వో శివశంకర్‌కు నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. ఆయన రెండు సెట్ల నామినేషన్‌లు దాఖలు చేశారు. తన అఫిడవిట్‌ను కూడా అందజేశారు. లావు వెంట ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, జనసేన నేత సయ్యద్ జిలానీ ఉన్నారు. నామినేషన్ దాఖలు అనంతరం పార్టీ శ్రేణులు భారీ ప్రదర్శన నిర్వహించాయి. పల్నాడు రోడ్డులోని శ్రీ సాయిరామ్ టవర్స్ వద్ద కేఎల్‌రావు ఆధ్వర్యంలో మహిళలు లావుకు హారతులిచ్చి నీరాజనాలు పలికారు. అక్కడి నుంచి ప్రారంభమైన ర్యాలీ గడియార స్తంభం సెంటర్ వరకు సాగింది. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనంపై లావు ఆసీనులై ప్రజలకు అభివాదం చేశారు. ప్రదర్శనలో ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, మాజీమంత్రి కన్నా లక్ష్మీనారాయణ, జిల్లా పార్టీ అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్, మాజీ ఎమ్మెల్యేలు జీవీ ఆంజనేయులు, యరపతినేని శ్రీనివాసరావు, పెదకూరపాడు టీడీపీ అభ్యర్థి భాష్యం ప్రవీణ్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నల్లపాటి రామచంద్రప్రసాద్ తదితర నేతలు పాల్గొన్నారు. శ్రీకృష్ణదేవరాయలు తొలుత కోటప్పకొండ శ్రీత్రికోటేశ్వరస్వామిని కుటుంబ సభ్యులతో కలసి దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. డాక్టర్ అరవిందబాబు ఆర్డీవో కార్యాలయంలో ఆర్వో పి.సరోజకు నామినేషన్ పత్రాలను అందజేశారు. ఆయన వెంట టీడీపీ నేతలు మన్నవ మోహనకృష్ణ, వేములపల్లి వెంకటనరసయ్య ఉన్నారు. నామినేషన్ దాఖలు సందర్భంగా గుంటూరు రోడ్డులోని టీడీపీ కార్యాలయం నుంచి భారీ ప్రదర్శన నిర్వహించారు. గుంటూరు రోడ్డు, మల్లమ్మ సెంటర్ మీదుగా గడియార స్తంభం వరకు ర్యాలీ సాగింది. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనంపై డాక్టర్ అరవిందబాబు ఆసీనులై ప్రజలకు అభివాదం చేశారు. ప్రదర్శనలో దివ్యాంగుల కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు, కపలవాయి విజయకుమార్, కొట్టా కిరణ్‌కుమార్, కొల్లి బ్రహ్మయ్య, అట్లా చినవెంకటరెడ్డి, వాసిరెడ్డి రవి, పూదోట సునీల్, మన్నాన్ షరీఫ్, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ సయ్యద్ జిలానీ, బీజేపీ నేత రామకృష్ణ, మునిసిపల్ మాజీ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో అభ్యర్థులు లావు శ్రీకృష్ణదేవరాయలు, డాక్టర్ అరవిందబాబు



ర్యాలీలో ప్రజలకు అభివాదం చేస్తున్న డాక్టర్ అరవిందబాబు



కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వరస్వామి యాగశాలలో హోమ పూజల్లో లావు కృష్ణదేవరాయలు, ఆయన కుటుంబ సభ్యులు




లావు శ్రీకృష్ణదేవరాయలకు పల్నాడు రోడ్డులోని శ్రీసాయిరామ్ టవర్స్ వద్ద హారతులిస్తున్న మహిళలు



నరసరావుపేట అసెంబ్లీ ఆర్వో సి.సరోజకు నామినేషన్ పత్రాలను అందజేస్తున్న టీడీపీ అభ్యర్థి డాక్టర్ అరవిందబాబు

పట్టర పట్టు... కోవర్టు!

- ఎన్నికల వేళ జోరుగా జెండాల మార్పు
- నేతలను వెంటాడుతున్న కోవర్టుల భయం
- పార్టీ జెండా ఒకటి... పనిచేసేది మరొకరికి
- రాజకీయ వ్యూహాల విషయంలో జాగ్రత్తపడుతున్న నాయకులు



బాపట్ల, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ఎన్నికల వేళ నేతలకు సరికొత్త చిక్కు వచ్చిపడింది. నిన్నమొన్నటి వరకు ప్రత్యర్థి పార్టీలో ఉన్న నేతలు ఇప్పుడు సొంతవారయ్యారు.. ఇలా జోరుగా గోడ దూకుడుల పర్వం కొనసాగుతోంది. ఇంతవరకు బాగానే ఉన్నా నేతలకు ఇప్పుడు కోవర్టుల భయం పట్టుకుంది. స్వపక్షంలోనే ఉండి పనిచేసే కన్నా ప్రత్యర్థి వర్గంలోకి చేరి వారి ఆనుపానులను చేరవేయడం ఓ రాజకీయం. స్వపక్షంలోనే కొనసాగుతూ వారి వ్యూహాలను ప్రత్యర్థి పార్టీకి చేరవేయడం మరో కోవర్టు కళ. రాజకీయ పార్టీల గెలుపు ఎత్తుల్లో ఇది కూడా ఓ వ్యూహమే. పార్టీలోకి వచ్చేవారిని కాదనలేము.. అలా అని అందరినీ కోవర్టులుగా చూడలేం... కానీ ఒకరిద్దరు మాత్రం ఈ తరహా వ్యక్తులు కచ్చితంగా ఉంటారని నేతలే నమ్ముతున్నారు. ఇప్పుడు వచ్చిన చిక్కల్లా ఆ కోవర్టులను ఎలా పసిగట్టడం అనేది మాత్రమే... ముల్లుకు ముల్లు విరుగుడే అన్న చందాన ప్రధాన రాజకీయ పార్టీలన్నీ ప్రత్యర్థుల శిబిరాల్లో కోవర్టులను ఇప్పటికే మోహరించాయి. వీరి ద్వారానే తమ దగ్గర ఉన్న కోవర్టుల పేర్లు తెలుసుకునే సరికి అవాక్కవడం వారి వంతవుతోంది. ఫలానా వ్యక్తి కోవర్టు అని తెలిసినా బహిరంగంగా అది వెలిబుచ్చలేని వింత పరిస్థితి నేతలది. ఎందుకంటే ఇది ఎన్నికల వేళ కనుక.. ప్రతి ఓటు, ప్రతి నేత విలువైన వారే కావడంతో వారిని పార్టీలోనే ఉంచుతూ వారి విషయంలో జాగ్రత్త వహిస్తూ ఎన్నికల కార్యం జరిపించుకోవడమే ప్రస్తుతం నేతల ముందు ఉన్న తక్షణ కర్తవ్యంగా భావిస్తున్నారు.

నేతల్లో టెన్షన్..

రాజకీయం అంటేనే ఎదుటివారి బలాలు, బలహీనతలు తెలుసుకుని వాటికి అనుగుణంగా వైరి వర్గాలు గెలుపు వ్యూహాలు రచిస్తూ ఉంటాయి. కానీ నిన్న మొన్నటి వరకు తమ వెంట తిరిగిన వారు ఇప్పుడు ఆవల పక్షాన కనబడుతుండే సరికి వారిలో టెన్షన్ కనబడుతోంది. ఎందుకంటే వారి లోగుట్టులన్నీ సదరు నేతలకు తెలిసి ఉండడమే అందుకు కారణం. తన అంతరంగికులుగా మెలిగే ఒకరిద్దరి నేతల వద్ద మాత్రమే ఎన్నికల వ్యూహాలకు సంబంధించిన వివరాలు పంచుకుంటున్నారు. గోడలకు చెవులు ఉండొచ్చు అనే చందాన అత్యంత రహస్యంగా ఎన్నికల ప్రణాళికలకు పదును పెడుతూ కోవర్ట్ రాజకీయాలకు చెక్ పెట్టాలనే తలంపుతో నేతలు ఉన్నారు.

కోవర్ట్‌లు పలు రకాలు....

ఎన్నికల వేళ రాజకీయ పార్టీలు వివిధ రకాలుగా కోవర్ట్ ఆపరేషన్ చేపడుతుంటాయి. వాటిలో ముఖ్యంగా ప్రత్యర్థి శిబిరంలోనే ఉంచి దెబ్బతీయడం. ఇటీవల ఓ అభ్యర్థి వద్దకు ద్వితీయశ్రేణి నేత ఒకరు తాను ప్రస్తుతం ఉన్న పార్టీ వదిలేసి మీ గూటికి వస్తానని వర్తమానం పంపారు. సదరు అభ్యర్థి మాత్రం పార్టీ మారేకంటే అక్కడే ఉండి వారి పథక రచనలన్నీ తనకు చేరవేయాలని ఇదే తనకు చేసే మేలు అని చెప్పారు. అంతే అటు పార్టీ మారినట్లయింది.. ఇటు కోవర్ట్ ఆపరేషన్ మొదలయింది. ఇక రెండోది ఆవల శిబిరంలోకి వెళ్లి వారి నేతలు, కార్యకర్తలతో మమేకం అయిపోయి వారి వ్యవహారాలన్నీ గుట్టుచప్పుడు కాకుండా తన సొంత శిబిరం నేతలకు చేర్చడం. ఇదో రకం కోవర్టు వ్యవహారం. ఇక మూడో రకం కోవర్టులు కూడా ఉన్నారండోయ్.. వీరు తటస్థంగా ఉన్నట్లు కలరింగ్ ఇస్తూ ఏదో ఒక పక్షానికి లోపాయికారిగా పనిచేయడం. పోలీసులు నేరుగా డబ్బు ఉన్న చోటుకు వెళ్లే దాడులు కొన్ని సందర్భాల్లో నిర్వహిస్తుంటారు. ఇదంతా ఈ తటస్థ కోవర్టుల పుణ్యమే. ఇలా కోవర్టులందు రకాలు వేరయా అన్న చందాన వీరితో పెను ప్రమాదం కూడా అభ్యర్థులకు పొంచి ఉందండోయ్.

భలే అవకాశవాదం..

కోవర్ట్‌లకు మరో అవకాశం కూడా ఉంది. ప్రత్యర్థి పార్టీ ప్రయోజనాల కోసం పనిచేసినా ఇవతల పార్టీనే గెలిస్తే గుట్టుచప్పుడు కాకుండా ఆ విజయం క్రెడిట్‌ను తనఖాతాలో వేసుకుని ఎంచక్కా ఆ నేత నీడలోనే ఉండొచ్చు. ఇలా కాకుండా ఎవరికోసమయితే కోవర్టు అవతారమెత్తారో వారే గెలిస్తే దర్జాగా మళ్లీ వారి దగ్గరకు వెళ్లిపోయి అక్కడా గెలుపు క్రెడిట్‌ను తన ఖాతాలో వేసుకునే ఉభయకుశలోపరి సౌలభ్యం కోవర్టులకు మాత్రమే ఉంది.

అందరూ మంచివారే.. కానీ..

అధికార పార్టీ మీద అసంతృప్తితో పాటు ప్రభుత్వ నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగానో, పార్టీల ఏకపక్ష ధోరణి నచ్చకనో పార్టీలు మారడం సహజం. ఇలా మారే వారిలో చాలా మంది నిజంగా నిండుమనసుతో పార్టీ మారేవారే. కానీ ఒకరిద్దరు మాత్రం కోవర్టు రాజకీయం చేస్తుంటారు. ఈ మొత్తంలో వారిని పసిగట్టడమే పార్టీలకు పెద్ద కోవర్ట్ పరీక్ష ప్రస్తుతం. ఒక్కోసారి నిబద్ధత కలిగిన నేతనే పూర్వపక్షం చేసి కోవర్టుకే పెద్దపీట వేసే నేతాగణానికీ కొదవేలేదు. ఇలా జరిగితే దెబ్బకు పుట్టి మునగడం ఖాయమవడంతో పాటు తీరా ఫలితం వచ్చాక కోవర్టు దెబ్బకు రిజల్ట్ తారుమారు అయిందని ఎంత వగచినా ప్రయోజనం గుండుసున్నా. అందుకే నేతలూ కోవర్టులతో బహుపరాక్... జాగ్రత్త

నిష్పక్షపాతంగా ఎన్నికల విధులు

- చెక్‌పోస్టుల్లో ముమ్మరంగా తనిఖీలు
- రూ.1.70 కోట్ల సొత్తు స్వాధీనం
- నోటిఫికేషన్‌ను విడుదల చేసిన జిల్లా ఎన్నికల అధికారి

నరసరావుపేట, ఏప్రిల్ 18: జిల్లాలో ఎన్నికలు నిష్పక్షపాతంగా, సజావుగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శివశంకర్ తెలిపారు. నరసరావుపేట లోక్‌సభ, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి గురువారం ఆయన నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నామినేషన్ ప్రక్రియ ప్రారంభమైందన్నారు. జిల్లావ్యాప్తంగా నిర్వహించిన తనిఖీల్లో రూ.1.70 కోట్ల నగదు, మద్యం, ఇతర సామగ్రి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. చెక్‌పోస్టుల వద్ద ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నట్లు తెలిపారు. ఎస్పీ బిందుమాధవ్ మాట్లాడుతూ నామినేషన్ స్వీకరణ కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఆర్‌వో కేంద్రాలకు నోడల్ అధికారిగా డీఎస్పీ స్థాయి అధికారిని నియమించామన్నారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘనకు సంబంధించి ఇప్పటి వరకు జిల్లాలో 100 కేసులు నమోదయ్యాయన్నారు. సమావేశంలో డీఆర్వో వినాయకం పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్, ఎస్పీ బిందు మాధవ్

12 నామినేషన్ల దాఖలు

జిల్లాలో తొలి రోజు నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా ప్రారంభమైంది. గురువారం అసెంబ్లీ స్థానాలకి 11, లోక్‌సభ స్థానానికి ఒక నామినేషన్ దాఖలయ్యాయి. లోక్‌సభ టీడీపీ కూటమి అభ్యర్థిగా లావు శ్రీకృష్ణదేవరాయలు, నరసరావుపేట అసెంబ్లీకి డాక్టర్ చదలవాడ అరవిందబాబు నామినేషన్లు దాఖలు చేశారు. ఇక ఆయా పార్టీల తరపున నరసరావుపేటలో గోదా రమేష్(జాతీయ జనసేన), మాచర్లలో టీడీపీ కూటమి అభ్యర్థిగా జూలకంటి బ్రహ్మారెడ్డి, చిలకలూరిపేటలో రామ సుబ్రహ్మణ్యం(నవతరం పార్టీ), వినుకొండలో గడ్డం రమణ (పిరమిడ్), పెదకూరపాడులో జంగా మల్లికార్జునరావు (పిరమిడ్), గౌడ్‌కట్ల అంకమ్మరావు(స్వతంత్ర), సత్తెనపల్లిలో రంగిశెట్టి నాగేశ్వరరావు(పిరమిడ్), గోదా వెంకటరమణ (జాతీయ జనసేన), గురజాలలో యర్రమోతు ప్రసాదరావు (పిరమిడ్), కనకం శ్రీనివాసరావు(స్వతంత్ర) నామినేషన్ దాఖలు చేశారు.

సందట్లో సడేమియా!

- ప్రచారానికి ప్యాకేజీలు

మండు వేసవిలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో.. ప్రధాన పార్టీల అభ్యర్థులు విజయమే లక్ష్యంగా ఇప్పటికే ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. డబ్బును మంచినీళ్లల్లా ఖర్చు పెడుతున్నారు. మరో మూడు వారాలు పాటు అభ్యర్థులకు ఈ పరిస్థితి తప్పేలా లేదు. ఇదే అవకాశంగా కొందరు సందట్లో సడేమియాలు రంగంలోకి దిగారు. పలు పార్టీల అభ్యర్థులను కలసి థర్డ్ పార్టీ ఏజెన్సీ కింద ఇన్‌స్టెంట్ ప్రచార బాధ్యతలు తాము నిర్వహిస్తామని కొత్త వ్యాపార కిటుకులు చెబుతున్నారు. దీనికి పలు ప్యాకేజీలు పెట్టారు. .రూ.3 లక్షలకు అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రతి ఇంటికి ఆ అభ్యర్థి ప్రచార కరపత్రాలు పంపిణీ చేస్తామని, రూ.5 లక్షలు ఇస్తే పలు యూట్యూబ్ ఛానల్ ద్వారా అభ్యర్థి ఎన్నికల ప్రచార ప్రకటనలు, ఇంటర్వ్యూలు ప్రసారం చేయిస్తామంటున్నారు. నేరుగా అభ్యర్థి వెంట ప్రచారంలో జనాలు పాల్గొనాలంటే ఒక్కో కార్యకర్తకు రోజుకు రూ.వెయ్యి చెల్లించాలని, భోజనం, టిఫిన్‌కు అదనపు చెల్లింపులు ఉంటాయని చెబుతున్నారు. రోజుకు ఎంత మందిని కావాలంటే అంత మందిని సమకూరుస్తామని, ముందుగా కొంత అడ్వాన్స్ చేతిలో పడేయమని ఒత్తిడి తెస్తున్నారు. తమది భలే మంచి చౌక బేరమంటున్నారు. వీరు చెబుతున్న ప్యాకేజీలకు అభ్యర్థులకు పట్టపగలే చుక్కలు కనిపిస్తున్నాయి. ఇక కొన్ని కుల సంఘాలు కూడా ఇదే అదనుగా భావించి రంగంలోకి దిగాయి. అధికార పార్టీ అభ్యర్థులను, సిటింగ్ ఎమ్మెల్యేలను వీరు లక్ష్యంగా చేసుకొని.. తమ సంఘం మీకే పూర్తి మద్దతు ఇస్తుందని, ఏదో మీకు తోచింది మా సంఘానికి ఫండింగ్ ఇవ్వాలని ఒత్తిడి తెస్తూ దొరికినకాడికి అందిపుచ్చుకుంటున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఈ దందా జోరుగా సాగుతోంది.

- గుంటూరు

బరిలోకి.. తొలిసారి

- ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి 10 మంది రంగంలోకి

గుంటూరు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): రాజకీయ చైతన్యం కలిగిన ఉమ్మడి గుంటూరు జిల్లా కొత్త తరం నాయకులకు వేదికగా మారింది. ప్రధాన రాజకీయ పార్టీలైన తెలుగుదేశం, వైసీపీలు రాజకీయ ఎత్తుగడలతో కొత్త వారికి అవకాశం కల్పించాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో మొత్తం 10 మంది కొత్త అభ్యర్థులు ఈ సారి ఎన్నికల బరిలో నిలిచేందుకు ప్రధాన పార్టీలు అవకాశం కల్పించాయి. వారిలో గుంటూరు తూర్పు నుండి నూరి ఫాతిమా బరిలోకి దిగి ప్రచారం నిర్వహిస్తున్నారు. ఆమె తన తండ్రి, సిట్టింగ్ ఎమ్మెల్యే ముస్తఫాకు వారసురాలిగా వైసీపీ అభ్యర్థిగా రంగప్రవేశం చేసింది. గుంటూరు పశ్చిమ నుంచి గళ్నా మాధవి అనూహ్యంగా బరిలోకి దిగారు. ఆమె కుటుంబానికి ఎటువంటి రాజకీయ నేపథ్యం లేకపోయినప్పటికీ కుల సమీకరణలో భాగంగా ఆమె అభ్యర్థిత్వాన్ని చంద్రబాబునాయుడు ఖరారు చేశారు. కమ్మ సామాజికవర్గం వారు ఈ సీటుపై ఎన్నో ఆశలు పెట్టుకున్నప్పటికీ ఇదే నియోజకవర్గం నుంచి వైసీపీ తరపున బీసీ సామాజికవర్గానికి చెందిన మంత్రి విడదల రజినీ బరిలోకి దిగటంతో టీడీపీ కూడా బీసీ సామాజికవర్గ మహిళనే ఎంపిక చేసింది. పెదకూరపాడు నుంచి భాష్యం ప్రవీణ్ యువత కోటాలో టీడీపీ టికెట్ దక్కించుకున్నాడు. మంగళగిరి నుండి వైసీపీ అభ్యర్థిగా మాజీ మంత్రి మురుగుడు హనుమంతరావు కోడలు మురుగుడు లావణ్య ఎన్నికల బరిలోకి దిగారు. టీడీపీ అభ్యర్థి, యువనేత నారా లోకేశ్‌ను ఆమె ఢీకొంటున్నారు. ప్రత్తిపాడు నుంచి వైసీపీ అభ్యర్థి స్థానికేతరుడైన బలసాని కిరణ్ కుమార్ బరిలోకి దిగారు. పొన్నూరు నుంచి మంత్రి అంబటి రాంబాబు సోదరుడు అంబటి మురళీకృష్ణ వైసీపీ అభ్యర్థిగా రంగ ప్రవేశం చేశారు. సిట్టింగ్ ఎమ్మెల్యే కిలారి రోశయ్యను గుంటూరు ఎంపీ అభ్యర్థిగా పంపటంతో మురళీకి అవకాశం దక్కింది. చిలకలూరిపేట నుంచి గుంటూరు నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు వైసీపీ అభ్యర్థిగా రంగప్రవేశం చేశారు. బాపట్ల నుంచి వేగేశన నరేంద్రవర్మ టీడీపీ అభ్యర్థిగా తొలిసారి ఎన్నికల బరిలోకి దిగారు. ఈ ఐదేళ్ళుగా ఆయన ఆ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరిస్తూ వచ్చారు. రేపల్లె నుంచి వైసీపీ అభ్యర్థిగా ఈవూరి గణేశ్‌ను బరిలోకి దింపారు. ఈ నియోజకవర్గంపై ఆధిపత్యం చెలాయిస్తున్న మోపిదేవి కుటుంబానికి గండి కొట్టి ఇతనికి అవకాశం కల్పించారు. వేమూరు నుంచి వైసీపీ అభ్యర్థిగా వరికూటి అశోక్‌కుమార్ తొలిసారి ఎన్నికల బరిలోకి దిగుతున్నారు.

కోన రాగాలు!

- బాపట్లలో సినీ స్టూడియో ఏర్పాటు అంటూ కోన వెంకట్ ప్రకటన
- గతంలోనూ ఇదే హడావిడి, ఆచరణ శూన్యం
- ఎన్నికల జిమ్మిక్కుగా కొట్టిపారేస్తున్న ప్రజలు

బాపట్ల, ఏప్రిల్18(ఆంధ్రజ్యోతి): సరిగ్గా ఎన్నికల వేళ బాపట్లలో సినీ స్టూడియో కట్టి ఉపాధి అవకాశాలు కల్పిస్తానంటూ సినీ నిర్మాత కోన వెంకట్ గురువారం మీడియా సమావేశంలో ప్రకటించడం చర్చకు దారి తీసింది. ఈయన బాపట్ల వైసీపీ ఎమ్మెల్యే కోన రఘుపతి బంధువు కావడంతో పాటు ఆయన గెలుపుకోసం విస్తృతంగా ప్రచారం కూడా చేస్తున్నారు. 2019 ఎన్నికల వేళ, తర్వాత కూడా బాపట్లలో స్టూడియో ఏర్పాటు అంటూ ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపించారు. మధ్యలో రాజకీయ పరమైన కారణాలతో స్టూడియో నిర్మాణం అడుగులు ముందుకు పడలేదనే అభిప్రాయం వ్యక్తం చేశారు. మళ్లీ ఇప్పుడు ఎన్నికల వేళ స్టూడియో ఏర్పాటు అంశాన్ని తెరమీదకు తేవడంతో ఇవన్నీ ఓట్ల కోసం జిమ్మిక్కులేనని బాపట్ల ప్రజలు కొట్టిపారేస్తున్నారు.

వినుకొండ మున్సిపాల్టీలో వరుస దొంగతనాలు


చక్రాలు దొంగలించిన ద్విచక్రవాహనం

వినుకొండ టౌన్, ఏప్రిల్ 18: వినుకొండ మున్సిపాల్టీలో మూడు రోజులుగా రెండు ద్విచక్ర వాహనాలతోపాటు నీళ్ళ మోటారు దొంగిలించిన ఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. మున్సిపల్ కాంపెక్స్‌లో కూల్ డ్రింక్ షాపు యజమాని పసుపులేటి శ్రీనివాసరావు ద్విచక్రవాహనం మున్సిపల్ కార్యాలయంలో ఉంచగా శనివారం చోరీకి గురైంది. ఇదిలా ఉండగా పార్కులో నీటివసతి కోసంఏర్పాటుచేసిన బోరు మరమ్మతులకు గురికావడంతో అధికారులు ఇటీవల తీసి పార్కు సమీపంలో ఉంచారు. ఇది గమనించిన దొంగలు మోటారును దొంగలించారు. కార్ ట్రావెల్స్ యజమాని వాసుకు చెందిన ద్విచక్రవాహనం మున్సిపల్ కార్యలయంలో ఉంచగా బుధవారం ద్విచక్రవాహనం చక్రాలను దొంగలు దొంగలించారు. ఇలా వరుస దొంగతనాలు జరుగుతుండటం సర్వత్ర చర్చనీయాశంగా మారింది.

వినుకొండ అసెంబ్లీ ఎన్నికలకు తొలి నామినేషన్

వినుకొండటౌన్, ఏప్రిల్ 18: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియాకు చెందిన గడ్డం రమణ ఆర్వో సుబ్బారావును కలిసి నామినేషన్ పత్రాలు అందజేశారు. ఎన్నికల పత్రాన్ని క్షుణ్ణంగా పరిశీలించి నామినేషన్ స్వీకరించారు. ఆమె గతంలో పిరమిడ్‌పార్టీ ఆఫ్ ఇండియా తరుపున ఫ్లూట్ గుర్తుపై పోటీచేశారు.

రొంపిచర్ల మండలంలో...

రొంపిచర్ల, ఏప్రిల్ 18: మండలంలోని నలగార్లపాడు గ్రామానికి చెందిన గోదా రమేష్ కుమార్ జాతీయ జనసేన పార్టీ నరసరావుపేట అసెంబ్లీ అభ్యర్థిగా గురువారం నామినేషన్ దాఖలు చేశారు. రిటర్నింగ్ అధికారి సరోజినికి నామినేషన్ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ యనమాల దిలీప్ కుమార్, న్యాయవాది గుదె కిరణ్ కుమార్, రమణ, గోదా వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

శావల్యాపురం మండలంలో 90 మంది వలంటీర్ల రాజీనామా

శావల్యాపురం, ఏప్రిల్ 18: మండలంలోని వేల్పూరు, పోట్లూరు, కొత్తలూరు, శావల్యాపురం, శానంపూడి, మతుకుమల్లి, కారుమంచి, పిచికలపాలెం సచివాలయాల పరిధిలో 90మంది వలంటీర్లు గురువారం మూకుమ్మడిగా రాజీనామాలు చేసినట్లు ఎంపీడీవో కొర్రపాటి కవితాచౌదరి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ మండలంలోని 11వ సచివాలయ పరిధిలో 202మంది వలంటీర్లు ఉండగా ప్రస్తుతం 90మంది రాజీనామాలు చేశారన్నారు. ఇటీవల 33మంది, గురువారం 57మంది వలంటీర్లు రాజీనామా చేశారని తెలిపారు. కొత్తలూరులో ఐదుగురు వలంటీర్లు మంగళవారం రాత్రి ఇంటింటికీ తిరిగి వైసీపీకి చెందిన కరపత్రాలు పంపిణీ చేస్తుండగా స్థానికులు ఎంపీడీవోకి ఫిర్యాదు చేశారు. దాంతో ఎంపీడీవో వారిని వివరణ అడగ్గా ఐదు గురు వలంటీర్లు గురువారం రాజీనామా సమర్పించారు. ఎన్నికలకోడ్ అమల్లో ఉన్నప్పటికీ గ్రామాల్లో వలంటీర్లు పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటూ ఆడిగితే తాము రాజీనామాలు చేశామని బుకాయించి వెంటనే రాజీనామాలు చేస్తుండడం గమనార్హం.

యడ్లపాడు మండలంలో 31మంది...

యడ్లపాడు, ఏప్రిల్ 18: మండలంలోని పలు గ్రామ సచివాలయాలకు చెందిన 31మంది వలంటీర్లు రాజీనామా చేసినట్లు ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ యడ్లపాడు-1 సచివాలయ పరిధిలో ఏడుగురు, లింగారావుపాలెం సచివాలయ పరిధిలో 13 మంది, జాలాది సచివాలయ పరిధిలో ఏడుగురు, కారుచోల సచివాలయ పరిధిలో ఇద్దరు, యడ్లపాడు-2, చెంఘీజ్‌ఖాన్ పేట సచివాలయాల పరిధిలో ఒకరు వ్యక్తిగత కారణాలతో రాజీనామాలు చేస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శికి ఇచ్చిన రాజీనామా లేఖల్లో పేర్కొన్నట్లు వెల్లడించారు. కార్యదర్శుల సిఫార్సు మేరకు రాజీనామాలను ఆమోదించామన్నారు.


వైద్యశాల నూతనభవన సముదాయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

లిఖిత హాస్పటల్ నూతన భవనం ప్రారంభం

నరసరావుపేట రూరల్, ఏప్రిల్ 18: పట్టణంలోని సత్తెనపల్లి రోడ్డులో ప్రముఖ వైద్యశాల లిఖిత సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ నూతన భవన సముదాయాన్ని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గడిచిన 8 ఏళ్లుగా పల్నాడు ప్రాంతంలో లిఖిత సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ వైద్యసేవలందిస్తూ ప్రజల మన్ననలను పొందారని తెలిపారు. నాటి నుంచి నేటి వరకు అంచెలంచెలుగా ఎదుగుతూ పల్నాడు జిల్లాలోని ప్రముఖ వైద్యశాలగా ప్రజల ఆదరాభిమానాన్ని పొందుతున్నారన్నారు. కార్యక్రమంలో వైద్యులు మేకల రామిరెడ్డి, డాక్టర్ రామిరెడ్డి వినోద్ కుమార్, మేకల సునీత కుమారి, మేకల రామిరెడ్డి- విమలాదేవి, రామిరెడ్డి శ్రీనివాసులురెడ్డి- ఇంద్రసేనమ్మ దంపతులు, వైద్యశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వివిధ కేసుల్లో నిందితుల అరెస్టు

నరసరావుపేట లీగల్, ఏప్రిల్ 18: వివిధ కేసుల్లో గురువారం నిందితులను అరెస్టు చేసినట్టు ఆయా పోలీసు స్టేషన్‌ల అధికారులు గురువారం తెలిపారు. వరకట్న వేధింపుల నేపథ్యంలో భార్య మృతికి కారకుడైన పట్టణంలోని ప్రకాష్ నగర్‌కు చెందిన కొండ్రకుంట్ల చంద్రకాంత్‌ను, అక్రమ మద్యం కలిగి ఉన్న కేసులో నిందితులైన సంతమాగులూరుకు చెందిన ఆదాళం సుధాకర్ బాబు, ఉప్పలపాడుకు చెందిన దారా నాగరాజులను అరెస్టు చేసినట్టు సంబంధిత పోలీసు అధికారులు తెలిపారు. వారిని కోర్టులో ప్రవేశపెట్టనున్నట్టు తెలిపారు.

గొరిజవోలులో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

నరసరావుపేట లీగల్, ఏప్రిల్ 18: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా గురువారం నరసరావుపేట అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో నాదెండ్ల మండలం గొరిజవోలులోని జ్యోతిర్మయి స్పిన్‌టెక్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలోని సిబ్బందికి, కార్మికులకు అగ్ని ప్రమాదాలు, వాటి నివారణ పై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో అగ్నిమాపకశాఖ అధికారి ఎంవీ సుబ్బారావు, సిబ్బంది శ్రీనివాసరావు, కిరణ్, ప్రసాదు, సాంబశివరావు, కంపెనీ మేనేజింగ్, జనరల్ మేనేజర్ పూర్ణ చంద్రరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. కాగా పట్టణంలోని వినుకొండ రోడ్డులోని ఇండియన్ క్రిష్టియన్ స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు అగ్నిమాపక కేంద్రానికి రాగా వారికి అగ్ని ప్రమాదాల నివాణకై ముందుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించినట్టు అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపారు.

వెబ్‌సైట్ నుంచి హాల్ టిక్కెట్లు తీసుకోవాలి: రవినాయక్

రొంపిచర్ల, ఏప్రిల్ 18: మండలంలోని రెడ్డిపాలెం మోడల్ పాఠశాలలో 6వ తరగతి ప్రవేశానికి ఈ నెల 21వ తేదీన పరీక్ష జరగనుంది. సంబంధిత హాల్ టిక్కెట్లు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని ప్రిన్సిపాల్ రవినాయక్ గురువారం తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి వంద సీట్లకు గాను 265మంది దరఖాస్తు చేసుకున్నట్టు ఆయన తెలిపారు. హాల్‌టిక్కెట్ డౌన్‌లోడ్ చేసుకొని పరీక్షకు హాజరుకావాలని తెలిపారు. అదనపు సమాచారం కోసం పాఠశాల కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు.


ఉమ్మడివరంలో ఉపాధిహామీ పని ప్రాంతంలో కూలీల నీడ కోసం ఏర్పాటు చేసిన టెంటు

పనిప్రాంతంలో మౌలిక వసతుల ఏర్పాటు

వినుకొండ టౌన్, ఏప్రిల్ 18: జాతీయ ఉపాధిహామీ పథకం కింద జరుగుతున్న పనుల ప్రాంతంలో కలెక్టర్ లోతేటి శివశంకర్ ఆదేశాల మేరకు మౌలిక వసతులను ఏర్పాటు చేసినట్లు ఏపీవో నాగేశ్వరరావు గురువారం ఒక ప్రకటన లో తెలిపారు. పని జరిగే ప్రాంతంలో వృద్ధులు, యువకులు, మహిళలకు ఎండ వేడమి నుంచి తట్టుకునేందుకు నీడతోపాటు షెడ్లు, తాగునీరు, మెడికల్ కిట్స్, ఎండ ఎక్కువగా ఉండడంతో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచామని ఆయన తెలిపారు. వినుకొండ మండలంలో మొత్తం 5వేల మంది కూలీలు పని చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

కూటమి ప్రభుత్వంలో ఇసుక ఉచితం

● మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు


పార్టీలో చేరిన వారిని సాదరంగా ఆహ్వానిస్తున్న మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, ఏప్రిల్ 18: ఎన్నికల అనంతరం రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం రాగానే మళ్లీ ఉచిత ఇసుక విధానం తీసుకు వస్తామని, నిర్మాణ రంగానికి చేయూతనిస్తామని మాజీమంత్రి, టీడీపీ నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు స్పష్టం చేశారు. విస్తారంగా లభించే సహజ వనరులైన ఇసుకను బంగారం కంటే ఖరీదుగా మార్చిన జగన్‌రెడ్డికి ఇసుక మాఫియాకు త్వరలోనే అంతం పలకపోతున్నామన్నారు. తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలో తీర ప్రాంత ప్రజలకు పూర్తి ఉచితంగా దూరంగా ఉన్న వారికి వెయ్యి రూపాయలకే ట్రాక్టర్ ట్రక్కు ఇసుక దొరికిన పరిస్థితి నుంచి ఇవ్వాళ ట్రక్కుకు ఐదు వేలు పెట్టినా దొరకక పోవటానికి వైసీపీ ఎమ్మెల్యేలు, జగన్ దోపిడీయే కారణమన్నారు. పట్టణంలోని సాంబ శివనగర్, వైఎస్ఆర్ కాలనీకి చెందిన 40వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరారు. గురువారం పార్టీ కార్యాలయంలో జరిగిన ఓ కార్యక్రమంలో వారందరికీ ప్రత్తిపాటి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ జగన్‌రెడ్డి ప్రభుత్వంలో హద్దు అదుపు లేని ఇసుక దోపిడీ వల్ల పేదల సొంతింటి కల ఆగిపోవటంతో నిర్మాణరంగంపై ఆధారపడిన 25లక్షల మంది భవన నిర్మాణ కార్మికుల జీవితాలు దుర్భరంగా మారాయన్నారు. వీటికి పరిష్కారంగానే టీడీపీ అధినేత చంద్రబాబు ఉచిత ఇసుక అందించాలని నిర్ణయం తీసుకున్నారని, దీంతో పాటు ఆగిపోయిన అమరావతిని తిరిగి పరుగులు పెట్టించటం, పెట్టుబడులకు అనుకూల వాతావరణం కల్పించటం ద్వారా నిర్మాణరంగానికి ఊతం అందించాలనే ఆలోచనలో చంద్రబాబు ఉన్నారన్నారు. ప్రజలందరూ రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం కూటమి అభ్యర్థిగా ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా శ్రీకృష్ణ దేవరాయలను సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు.

మతం, రిజర్వేషన్‌ల పేరుతో జగన్ మోసం

నాదెండ్ల, ఏప్రిల్ 18: మతం పేరుతో దళితులను, రిజర్వేషన్‌ల పేరుతో మైనార్టీలను ముఖ్యమంత్రి జగన్ మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు విమర్శించారు. మండలంలోని గొరిజవోలులో ఎన్నికల శంఖారావంలో భాగంగా సూపర్-6 పథకాలపై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో నమ్మి ఓట్లు వేసిన ప్రతి ఒక్కరిని మోసంచేసిన జగన్‌కు ఓట్లు అడిగే అర్హత ఎక్కడ ఉందని ప్రశ్నించారు. టీడీపీ అధికార ప్రతినిధి పిల్లి మాణిక్యరావు మాట్లాడుతూ జగన్ అధికారంలోకి వచ్చాక దళితులు, బలహీన వర్గాలే ఎక్కువగా మోసపోయారన్నారు. ఈ సందర్భంగా పలు కుటుంబాలు టీడీపీలో చేరారు. కార్యక్రమంలో జనసేన సమన్వయకర్త తోట రాజారమేష్, స్థానిక నాయకులు గుర్రం స్వాములు, విడపలపాటి వాసు, పొన్నం నాగేశ్వరరావు, పోపూరి మస్తాన్‌రావు, దివ్య పిచ్చయ్య, రాఘవయ్య, వేముల నాగేశ్వరరావు, యోబు, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

మూడు గ్రామాల్లో ప్రత్తిపాటి ప్రచారం

యడ్లపాడు, ఏప్రిల్ 18 : జగన్‌రెడ్డి చేసిన మోసానికి తిరిగి ఆ పార్టీకి ఎవరూ ఓటు వేయరని మాజీమంత్రి ప్రత్తిపాటి పులారావు అన్నారు. గురువారం రాత్రి మండలంలోని సంగంగోపాలపురం, చెంఘీజ్ ఖాన్‌పేట, కోట గ్రామాల్లో ఎన్నికల శంఖారావం, సూపర్‌సిక్స్ పథకాలపై నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో ప్రత్తిపాటి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదవారిని లక్ష్యంగా చేసుకుని వారి పొట్టగొట్టి నిరుపేదలుగా మార్చాడన్నారు. ఇటీవల నాలుగు బటన్‌లు నొక్కాడు ఎవరికైనా ఏ పథకం క్రిందనైనా డబ్బులు పడ్డాయా అంటూ ప్రశ్నించారు. స్థానిక సంస్థలకు చెందిన రూ.13వేల కోట్లు జగన్ కాజేసిన జగన్ వాటి ఊపిరి ఆపేస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయితీల్లో చిల్లిగవ్వ లేకుండా చేసి రాష్ట్రంలోని 12,918 పంచాయితీలను సంక్షోభంలోకి నెట్టాడన్నారు. జలజీవన్ మిషన్ వంటి కేంద్ర పథకాలను కూడా సద్వినియోగం చేసుకోలేక, కేంద్రం కేటాయించిన నిధులు ఒక్క రూపాయి కూడా ఉపయోగించుకోని ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అన్నారు. ఈ పథకం అమలులో రాష్ట్రం 26వ స్థానంలో ఉందంటే జగన్ ప్రభుత్వం పనితీరు అందుకు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో మండల, గ్రామ టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

పార్వతీదేవి ఆలయంలో ఎంపీ లావు పూజలు

యడ్లపాడు, ఏప్రిల్ 18: నరసరావుపేట పార్లమెంట్ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు గురువారం బోయపాలెంలోని పార్వతీదేవి ఆలయాన్ని సందర్శించారు. నామినేషన్ వేసేందుకు గుంటూరు నుంచి నరసరావుపేట బయలుదేరి వెళుతూ మార్గమధ్యలో పల్నాడు ముఖద్వారమైన బోయపాలెంలోని చారిత్రక పార్వతీదేవి ఆలయంలోని అమ్మవారిని సతీ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బోయపాలెంకు చేరుకున్న ఆయనకు యడ్లపాడు, నాదెండ్ల మండలాలకు చెందిన పార్టీ నాయకులు, అభిమానులు ఘనస్వాగతం పలికారు. పూజల అనంతరం ర్యాలీగా నరసరావుపేటకు తరలి వెళ్లారు.

నిష్పక్షపాతంగా, పారదర్శకంగా ఎన్నికలు నిర్వహిస్తాం

● జిల్లా పోలీసు అధికారుల సంఘం వెల్లడి


నరసరావుపేట, ఏప్రిల్ 18: జిల్లాలో నిష్పక్షపాతంగా, పారదర్శకంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహిస్తామని జిల్లా పోలీసు అధికారుల సంఘం గురువారం వెల్లడించింది. ఏ పోలీస్ స్టేషన్ పరిధిలోనైనా రాజకీయ అల్లర్లు, ఆయావర్గాల మధ్య వివాదాలు జరిగి ప్రజల శాంతి భద్రతలకు విఘాతం కలిగినప్పుడు పోలీసు వారు తక్షణమే స్పందించి, అటువంటి విషయాలలో బాధ్యులపై వెంటనే కేసులు నమోదు చేసి, నిందితులను అరెస్టు చేసి చట్టపరంగా తగుచర్యలు తీసుకుంటామన్నారు. నేరాలు బెయిలబుల్ అయితే 41సీఆర్‌పీసీ నోటీసు ఇవ్వడం, నాన్ బెయిలబుల్ అయితే అరెస్టుచేసి రిమాండ్‌కు పంపడం జరుగుతుదన్నారు. ఏ పార్టీకి గానీ ఏ వర్గానికి గాని పక్షపాతం చూపించడం జరగదన్నారు. తెలుగుదేశం పార్టీ సానుభూతిపరుడు జలీల్‌ఖాన్‌పై వైసీపీ నేతల దాడిపై అదే రోజు కేసు నమోదుచేసి దర్యాప్తు చేసి ఆరుగురు నిందితులను అదుపులోకి తీసుకొని, వారిపై 41(ఏ), సీఆర్‌పీసీ ప్రకారం చర్యలు తీసుకోవడంతో పాటు వారిని బైండోవర్ చేశామన్నారు. లోక్ సభ నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి శ్రీకృష్ణదేవరాయలు ప్రచార వాహనాన్ని ధ్వంసం, వాహన డ్రైవర్‌పై దాడి ఘటనపై రెంటచింతల పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితులను బైండోవర్ చేయడం కూడా జరిగిందన్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తదుపరి రోజు మాచర్లలో తెలుగుదేశం నేత కారును వైసీపీ నాయకులు తగలబెట్టడంపై మాచర్ల పోలీసు స్టేషన్‌లో కేసు నమోదుచేసి దర్యాప్తులో భాగంగా ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకొని చట్టప్రకారం వారికి 41(ఏ) సీఆర్‌పీసీ నోటీసు ఇచ్చి వారిని బైండోవరు చేశారన్నారు. పెదకూరపాడు నియోజకవర్గ పరిధిలోని క్రోసూరులో చంద్రబాబు ప్రజాగళం సభ జరిగిన మరుసటి రోజు టీడీపీ కార్యాలయాన్ని తగలబెట్టిన కేసులో అనుమానితులను గుర్తించటం కోసం టెక్నికల్ సాక్ష్యాలను సేకరిస్తున్నామని, నిందితులను త్వరలనే అరెస్టు చేయడం జరుగుతుందన్నారు. వెల్దుర్తి మండలం కొత్త పుల్లారెడ్డిగూడెంలో ముడావత్ తులసినాయక్ తలపై గొడ్డలితో దాడి చేసి దుకాణం, ఆటో ధ్వంసం చేసిన ఘటనపై కింద వెల్దుర్తి పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసి ఏడుగురు నిందితులను అదుపులోకి తీసుకొని వారికి చట్ట ప్రకారం 41(ఏ) సీఆర్‌సీఎస్ కింది నోటీసులు ఇచ్చి వారిని బైండోవర్ చేశామన్నారు. కారంపూడి మండలం కాకాని వారిపాలెం ఎస్సీ కాలనీలో కడియం నాగరాజుపై గొడ్డలితో దాడి ఘటనపై దర్యాప్తు చేపట్టి ఏడుగురు నిందితులను అదుపులోకి తీసుకొని వారికి చట్ట ప్రకారం 41(ఏ) సీఆర్పీసీ నోటీసు ఇవ్వడం జరిగిందన్నారు. సత్తెనపల్లి నియోజకవర్గం ముప్పాళ్ళ మండలం తొండపిలో సయ్యద్ బాజీ తెలుగుదేశం తరఫున పోలింగ్ ఏజెంట్‌గా కూర్చుంటే చంపేస్తామని బెదిరించిన ఘటనపై 10మంది నిందితులను అదుపులోకి తీసుకొని వారికి నోటీసు ఇవ్వడంతో పాటు బైండోవర్ చేశామన్నారు. ఆయా కేసుల్లో సంఘటనను కారణమైన వారిపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి, వారికి చట్ట ప్రకారం నోటీసులు ఇచ్చే కేసులలో నోటీసులు ఇవ్వడం, రిమాండ్ చేసే కేసులలో రిమాండ్ చేసి, వాళ్ళని బైండోవర్ చేసుకోవడం కూడా జరిగిందని సంఘం తెలిపింది.

ములకలూరులో విస్తృత తనిఖీలు

నూజెండ్ల, ఏప్రిల్ 18: రానున్న సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా సమస్యాత్మక గ్రామమైన ములకలూరులో గురువారం ఉదయం వేకువజామున పోలీసు సిబ్బంది, సాయుధ బలగాలతో కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. వినుకొండ రూరల్ సీఐ యూ సుధాకర్‌బాబు ఆధ్వర్యంలో గ్రామంలోని ప్రతి గృహం, పొగాకు పందిళ్లు, కొష్టాలు పరిశీలించి 15 మోటారు సైకిళ్ళకు సరైన ధ్రువీకరణ పత్రాలు లేకపోవటంతో స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు ఎం.లక్ష్మీనారాయణరెడ్డి, ఫిరోజ్, చెన్నకేశవులు, సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీతోనే నాయీ బ్రాహ్మణుల జీవితాల్లో వెలుగులు

● టీడీపీ బీసీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంగాధర్


నాయీ బ్రాహ్మణులకు కరపత్రాలు అందజేస్తున్న గంగాధర్

శావల్యాపురం, ఏప్రిల్ 18: రానున్న ఎన్నికలలో టీడీపీని గెలిపించుకొంటేనే నాయీబ్రాహ్మణుల జీవితాల్లో వెలుగులు నిండుతాయని టీడీపీ బీసీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మద్దిరాల గంగాధర్ అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లోని నాయీబ్రాహ్మణులను ఆయన గురువారం కలిసి టీడీపీకి మద్దతుగా నిలవాలని కోరారు. బీసీ డిక్లరేషన్, నాయీబ్రాహ్మణుల హామీలతో కూడిన కరపత్రాలను వారికి అందజేశారు. గంగాధర్ మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం నాయీబ్రాహ్మణులకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తే వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే వాటిని నిలిపివేసి నాయీబ్రాహ్మణులను రోడ్డున పడేసిందన్నారు. మున్సిపాలిటీ, పంచాయతీ కాంపెక్స్‌లలో షాపుల కేటాయింపులకు చంద్రబాబు హామీ ఇచ్చారని తెలిపారు. జిల్లా కన్వీనర్ మాచర్ల హనుమంతరావు, వినుకొండ నియోజకవర్గ సాధికార సమితి సభ్యులు రామయ్య, కోటేశ్వరరావు, కె.చంద్రశేఖర్, శ్రీనివాసరావు, రమేష్, మల్లేశ్వరి పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతి కోసమే సూపర్-6 పథకాలు

● శావల్యాపురం జడ్పీటీసీ హైమావతి

శావల్యాపురం, ఏప్రి ల్ 18: మహిళల అభ్యున్నతి కోసమే చంద్రబాబు సూపర్-6 పథకాలను రూపొందించారని జడ్పీటీసీ పారా హైమావతి అన్నారు. శావల్యాపురంలో గురువారం ఇంటింటికీ తిరిగి పథకాల గురించి ప్రజలకు వివరి స్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. జడ్పీటీసీ మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి కూటమికి ప్రజలంతా మద్దతుగా నిలవాలన్నారు. టీడీపీ గ్రామ అధ్యక్షుడు నలమాటి వెంకటేష్, చెరుకూరి ప్రసాద్, పత్తిపాటి కోటిలింగం, మాదినేని కొండలు, దావులూరి కృష్ణ, గొడవర్తి రాంబాబు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రత్యేక కృషి: గోపిరెడ్డి

నరసరావుపేట రూరల్, 18: గ్రామాల అభివృద్ధి, సంక్షేమం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకృషి చేస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. నరసరావుపేట మండలం బసికాపురంలో గురువారం ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గడిచిన ఐదేళ్ళుగా నియోజకవర్గంలో, బసికాపురంలో చేసిన అభివృద్ధిని గ్రామ ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ రాజానందరెడ్డి, వైసీపీ నాయకులు వంపుగుడి జాన్, తదితరులు పాల్గొన్నారు.


16వ వార్డులో వైసీపీ నుంచి టీడీపీలో చేరిన వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న గోనుగుంట్ల లీలావతి

మహిళలకు గుర్తింపు చంద్రబాబుతోనే సాధ్యం

● గోనుగుంట్ల లీలావతి

వినుకొండ, ఏప్రిల్ 18: మహిళలకు ప్రపంచ స్థాయి గుర్తింపు పొందాలంటే చంద్రబాబుతోనే సాధ్యమని, స్వయం సహాయక బృందాలు మొదలు, వ్యాపార వేత్తలుగా తీర్చిదిద్దిన ఘనత చంద్రబాబుకే దక్కిందని తెలిపారు. రానున్న అయిదేళ్ళలో మహిళల కీర్తి సూపర్ సిక్స్ పథకాల ద్వార మరింత పెరగనుందన్నారు. అనంతరం 16 వార్డులోని అధికార వైసీపీ పార్టీ నుంచి తెలుగు దేశం పార్టీలో చేరారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జీవి తోపాటు, నర్సరావుపేట ఎంపీ అభ్యర్థి లావు శ్రీ కృష్ణ దేవరాయలను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గోపిరెడ్డి చేసినంత అవినీతి ఎవ్వరూ చేసిఉండరు

నరసరావుపేట నియోజవర్గ టీడీపీ ఇన్‌చార్జి అరవిందబాబు

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 18: నరసరావుపేట చరిత్రలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి చేసినంత అవినీతి ఎవ్వరూ చేసిఉండరని టీడీపీ నరసరావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చదలవాడ అరవింద బాబు అన్నారు. గురువారం పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలో నామినేషన్‌లు వేసే సందర్భంగా మీడియా మాట్లాడారు. డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ ఇంతకుముందు డాక్టర్ కోడెల శివప్రసాదు, కాసు వెంకట కృష్ణారెడ్డి నసరావుపేటను తీర్చిదిద్దారన్నారు. ఎమ్మెల్యే అయినందుకే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి రూ.2వేలకోట్ల ఆస్తులు సంపాదించుకున్నాడన్నారు. రూ.200 కోట్లు భూములు కబ్జాచేశాడన్నారు. గంజాయి, గోవా మద్యం అమ్మిచ్చి, రేషన్ బియ్యం అమ్ముకున్నాడని, మట్టిని అమ్ముకున్నాడని ఆరోపించారు. ఎన్నికల షెడ్యూలు రాగానే 5నుంచి ఆరు వేలమంది వైసీపీ కార్యకర్తలు టీడీపీ, జనసేన, బీజేపీలో చేరడానికి ఉత్సాహం చూపి ఉమ్మడి అభ్యర్థిగా ఉన్నా కాబట్టి టీడీపీలో చేరారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి, గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఇంటికిపోవడం ఖాయం అన్నారు. ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి టీడీపీ నాయకులపై ఎన్నో కేసులు పెట్టారని, అవమానించాడన్నారు. అందరూ ప్రజాస్వామ్యాన్ని కాపాడడానికి ముందుకు రావాలన్నారు. నియోజకవర్గ పరిశీలకుడు మన్నవ మోహన్‌కృష్ణ మాట్లాడుతూ ప్రజల ఉత్సాహం చూస్తే చదలవాడ అరవిందబాబు రాబోయే ఎన్నికలలో అఖండ మెజారిటీతో గెలుస్తారన్నారు. ఐదు సంవత్సరాల జగన్‌మోహన్‌రెడ్డి పాలన, నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి అసమర్థపాలనతో విసిగిపోయారన్నారు.

బులియన్ మర్చంట్ రాష్ట్ర అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్ మాట్లాడుతూ ప్రజల ఉత్సాహం చూస్తుంటే 15 నుంచి 20వేల మెజారిటీతో గెలుస్తారన్నారు. ఐదు సంవత్సరాలుగా నియోజకవర్గంలో దోపిడీ జరిగిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


సాతులూరులో గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎస్పీ బిందు మాధవ్

ప్రశాంత ఎన్నికలకు అందరూ సహకరించాలి

● ఎస్పీ బిందు మాధవ్

నాదెండ్ల, ఏప్రిల్ 18: రాబోయే సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని పల్నాడు జిల్లా ఎస్పీ బిందుమాధవ్ అన్నారు. మండలంలోని సమస్యాత్మక గ్రామాలైన అమీన్‌సాహెబ్‌పాలెం, కనపర్రు, సాతులూరు, చందవరం, గొరిజవోలు, చిరుమామిళ్ళ గ్రామాల్లో ఆయన గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఆయా గ్రామాల ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ ఎవరైనా ఎన్నికల సమయంలో ఘర్షణలో పాల్గొంటే పోలీసు కేసుల్లో ఇరుక్కోవాల్సి వస్తుందన్నారు. ఎన్నికలనేవి ఒక్కరోజు మాత్రమే జరుగుతాయన్నారు. ఆ ఒక్కరోజు అందరూ కలసిమెలసి ఇష్టమైన వారికి ఓటు వేసుకోవచ్చన్నారు. గ్రామంలో ఏమైనా సమస్యలు ఉన్నట్లయితే తమ దృష్టికి తీసుకు వస్తే పరిష్కరిస్తామన్నారు. పోలింగ్ రోజు పోలింగ్ కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. ఆయనతో పాటు రూరల్ సీఐ శ్రీనివాసరెడ్డి, ఎస్‌బీ సీఐ ప్రభాకర్, ఎస్‌ఐ జే బలరామిరెడ్డి తదితరులు ఉన్నారు.

చిలకలూరిపేటలో తొలి నామినేషన్ దాఖలు

చిలకలూరిపేట, ఏప్రిల్ 18 : చిలకలూరిపేట నియోజకవర్గ అసెంబ్లీ ఎన్నికల్లో గురువారం తొలి రోజున ఒక నామినేషన్ దాఖలైంది. నవతరం పార్టీ జాతీయ అధ్యక్షులు రావు సుబ్రహ్మణ్యం తరుపున ఈ నామినేషన్ దాఖలైంది. ఆయన తరుపున ఆయన భార్య రావు రామతులసీ రిటర్నింగ్ అధికారి బీ నారదమునికి నామినేషన్ పత్రాలు అందజేశారు. ఆయన తరఫున రెండు సెట్ల నామినేషన్‌లు దాఖలయ్యాయి.

టిక్కెట్ రాని అభ్యర్థులకు ఆఫర్

చిలకలూరిపేట, ఏప్రిల్ 18: చిలకలూరిపేట కేంద్రంగా ఉన్న నవతరం పార్టీ జాతీయ అధ్యక్షుడు రావు సుబ్రహ్మణ్యం గురువారం ఎన్నికల్లో పోటీ చేయదలచుకున్న అభ్యర్థులకు ఆఫర్ ఇచ్చారు. డబ్బులు లేవనే కారణంతో కొన్నిచోట్ల కొంత మందికి టిక్కెట్లు ఆయా పార్టీలు ఇవ్వటం లేదని, ఏ పార్టీలోనైనా మోసపోయిన అభ్యర్థులకు తగిన అర్హత ఉంటే నవతరం పార్టీ తరుపున పోటీ చేసే అవకాశం కల్పిస్తామని ఆయన ప్రకటించారు.

25న గురుకుల పాఠశాలలో ప్రవేశానికి పరీక్షలు

చిలకలూరిపేట, ఏప్రిల్ 18: ఏపీ గురుకుల విద్యాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే గురుకుల పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి ప్రవేశ పరీక్షను ఈ నెల 25వ తేదీన నిర్వహిస్తున్నట్టు ఆ సంస్థ కార్యదర్శి ఆర్ నరసింహారావు ప్రకటించారు. చిలకలూరిపేటలోని ఏపీ రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎస్.సుబ్రహ్మణ్యం ఈ వివరాలు తెలుపుతూ ఇప్పటికే హాల్ టిక్కెట్లను సంబంధిత వెబ్‌సైట్‌లో పెట్టామని, వాటిని అభ్యర్థులు నేరుగా డౌన్‌లోడు చేసుకోవాలన్నారు. పోస్టు ద్వారా హాల్ టిక్కెట్లు పంపరని గమనించాలని కోరారు. అభ్యర్థులు తమ హాల్ టిక్కెట్‌తో పరీక్షా కేంద్రానికి గంట ముందే చేరుకోవాలని పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు 5, 6, 7, 8 తరగతులకు ఏపీఆర్‌ఎస్ క్యాట్ 2024 పరీక్షలు, మధ్యాహ్నం 2:30 గంటల నుంచి ఐదు గంటల వరకు కళాశాలలకు సంబంధించి ఏపీఆర్‌జేసీ డీసీ సెట్ - 2024 పరీక్షలు రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో నిర్వహిస్తారని వారు తెలిపారు.

వలంటీర్ల రాజీనామాపై ఒత్తిడి

చిలకలూరిపేట, ఏప్రిల్ 18: చిలకలూరిపేట మునిసిపాలిటీ పరిధిలో ఉద్యోగానికి రాజీనామా చేయాలంటూ వలంటీర్లపై ఒత్తిడి పెరిగింది. తక్షణం వలంటీర్లుగా ఉద్యోగానికి రాజీనామా చేయాలంటూ సంబంధిత వ్యక్తులు కొందరు మొబైల్ ఫోన్‌లలో వలంటీర్లకు మెసేజ్‌లు పంపారు. గురువారం ఉదయం మునిసిపాలిటీ వద్దకు వచ్చి అధికారులకు రాజీనామా లేఖలు ఇవ్వాలని మెసేజ్‌లో వారు సూచించారు. చెప్పిన మాట వింటే తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తిరిగి వలంటీర్లుగా ఉద్యోగాలు ఇస్తామని పేర్కొన్నారు. కొందరు వలంటీర్లు రాజీనామా ఇవ్వటానికి మునిసిపల్ కార్యాలయం వద్దకు వచ్చారు. మరి కొందరు ముఖం చాటేశారు. రాజీనామా చేయటానికి వచ్చిన వారు మునిసిపల్ కమిషనర్ ఎన్నికల్లో విధుల్లో ఉండి సమయానికి అందుబాటులో లేకపోవటంతో రాజీనామా లేఖను మునిసిపల్ డీఈ టేబుల్‌పై పెట్టి వెళ్ళారు.

విట్ స్కూల్‌లో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

చిలకలూరిపేట, ఏప్రిల్ 18: అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా గురువారం పట్టణంలోని సుబ్బయ్యతోటలో ఉన్న విట్ స్కూల్‌లో విద్యార్థులకు అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమాన్ని స్థానిక అగ్నిమాపక కేంద్రం వారు నిర్వహించారు. గ్యాస్, విద్యుత్ సంబంధిత అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. స్కూల్ డైరెక్టర్ పవన్ కుమార్, ప్రిన్సిపల్ కల్పన, స్కూల్ ఇన్‌చార్జ్ రోజా, స్టేషన్ ఫైర్ అధికారి ఎన్ కిరణ్ కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు ఒయాసిస్ సాయం

చిలకలూరిపేట, ఏప్రిల్ 18: స్థానిక సేవా సంస్థ ఒయాసిస్ సంస్థ ఆధ్వర్యంలో పండరీపురంలోని మోడరన్ హైస్కూల్‌లో గురువారం పేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందజేశారు. సంస్థ సభ్యురాలు కోలా విజయలక్ష్మి ఆర్థిక సహకారంతో ఇద్దరు విద్యార్థినులకు రూ.15వేలు ఆర్థికసాయాన్ని అందజేశారు. గత మూడు సంవత్సరాలుగా ఈ సాయాన్ని కొనసాగిస్తున్నట్టు సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ కందిమళ్ళ జయమ్మ తెలిపారు. కార్యక్రమంలో కరీమా, విజయలక్ష్మి, సరోజిని, ఇందిర, రమాదేవి, దుర్గాదేవి తదితరులు పాల్గొన్నారు.

వడ్డెర యువకులను తక్షణం విడుదల చేయాలి: శివయ్య

చిలకలూరిపేట, ఏప్రిల్ 18: సీఎం జగన్ పై గులకరాయి వేశారని పోలీసులు అదుపులోకి తీసుకున్న సతీష్‌ను, ఇతర వడ్డెర యువకులను తక్షణం విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ సమైఖ్య వడ్డెర సంక్షేమం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పల్లపు శివయ్య గురువారం డిమాండ్ చేశారు. వారిని తక్షణం విడుదల చేయక పోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం ప్రారంభిస్తామని ఆయన హెచ్చరించారు. కోడి కత్తి డ్రామాలాగా గులకరాయి డ్రామా ప్రారంభమైందని ఆయన విమర్శించారు. పోలీసులు అక్రమంగా అదుపులోకి తీసుకున్న ఆ యువకులను తక్షణం విడుదల చేయాలన్నారు.